ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య
జిల్లా వార్తలు

5

శుక్రవారం 19 ఏప్రిల్ 2024

కురబల సంక్షేమానికి కృషి చేస్తా

● రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం



సుగవాసి బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న కురబ సంఘం నాయకులు


సుండుపల్లె, ఏప్రిల్ 18: కురబల సంక్షేమానికి కృషి చేస్తామని రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. గురువారం సుండుపల్లె మండల కేంద్రంలో కురబల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కురబల ఐకమత్యాన్ని ఇలాగే కొనసాగించాలని, కురబలు రాజకీయ ఆర్థిక, సామాజిక రంగాల్లో రాణించే విధంగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను శాసనసభకు పంపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో కురబ సంఘం నాయకులు ఆయనను పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కురబ సంఘం నాయకులు రమణ, గాలి వెంకట్రమణ, జయరామ్, సురేశ్‌కుమార్, శ్రీనివాసరాజు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకేదీ భరోసా..?



● ప్రభుత్వ ప్రచార ఆర్భాటమే ● నవరత్నాల్లో ఇదో మోసం.. ● బటన్ నొక్కినా.. డబ్బులు పడలే.. ● జగనన్నా.. నీకెందుకు ఓటెయ్యాలి..?

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేసింది మూరెడు.. చెప్పుకుంటోంది.. బారెడు.. అందుకు పెద్ద ఉదాహరణే.. నవరత్నాలు.. అధికారంలోకి రాగానే.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు అందరి నోటా... నవరత్నాల గొప్పలే. నిజంగానే ఈ నవరత్నాలు రాష్ట్రంలో పేదల బతుకుల్లో వెలుగులు నింపుతాయేమో.. అనే అభిప్రాయం అందరిలో కలిగింది. అయితే నవరత్నాలు అమలు జరుగుతున్న తీరుతెన్నులు చూస్తే.. నవరత్నాలు కాదు. అవి నవ మోసాలు అని ప్రజలకు పేర్కొంటున్నారు. నిజంగా ప్రభుత్వానికి ప్రజలకు మేలు చేయాలనే సంకల్పం ఉంటే.. పథకాల అర్హుల ఎంపికలో చాలా సరళంగా ఉండాలి. అయితే రాష్ట్ర ప్రభుత్వం అర్హుల ఎంపికలో అనేకమైన నిబంధనలు పెడుతోంది. దీంతో అర్హులై ఉండి కూడా చాలామంది పథకాలకు నోచుకోలేకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకుంటున్న రైతు భరోసా పథకంలోనూ.. పలువురు నిజమైన లబ్ధిదారులకు పథకం అందడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం రూ.7500, కేంద్ర ప్రభుత్వం రూ.6000 కలిపి మొత్తం రూ.13500 ఇస్తోంది. సంవత్సరానికి మూడు విడతలుగా ఇచ్చే ఈ సాయంలో లబ్ధిదారుల ఎంపికలో రాష్ట్ర ప్రభుత్వ తీరు వల్ల పలువురు నిజమైన అర్హులు నష్టపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. అన్ని అర్హతలు ఉన్నా..ఈ పథకం వర్తించని పలువురు రైతులు ఏళ్ల తరబడి సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా.. ప్రయోజనం కలగడం లేదు. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి



నిధులు విడుదల చేస్తున్నట్లు బటన్లు నొక్కినా.. నెలలు గడిచినా.. రైతుల బ్యాంకు ఖాతాల్లో మాత్రం పడడం లేదు.

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రూ.6000 సాయానికి తోడుగా అదనంగా రూ.7500 కలిపి మొత్తం రూ.13,500 ఇచ్చేందుకు 2019 ఫిబ్రవరి 15న రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద ఏటా మూడు విడతలుగా రాష్ట్రంలోని అర్హులైన రైతులు బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా డబ్బు జమ చేయాలి. అయితే లబ్ధిదారుల సంఖ్యలోనే అసలు తిరకాసు ఉందనే అభిప్రాయం లబ్ధిదారుల్లో ఉంది.

పొరపాటున ఆస్తులు తన పేరు మీద ఉన్న కుటుంబ పెద్ద చనిపోతే.. అప్పటి వరకు ఆ కుటుంబానికి అందుతున్న రైతు భరోసా ఇవ్వడం లేదు. అన్ని పత్రాలతో దరఖాస్తు చేసుకున్నా.. రైతు భరోసాను వర్తింప చేయడం లేదు. కాళ్లరిగేలా సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాధుడే లేడని రైతులు వాపోతున్నారు అర్హతలు ఉన్న ఎంత మంది దరఖాస్తు చేసుకున్నా.. మేము ఇచ్చినంత మందే లబ్ధిదారులే తీసుకోవాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందనే విమర్శలు ఉన్నాయి.

జిల్లాలో రెండు లక్షల మంది లబ్ధిదారులు

జిల్లా ఏర్పడిన 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో రైతు భరోసా పథకం కింద 2,05,723 మంది లబ్ధిదారులు ఉన్నారు. రాయచోటి నియోజకవర్గంలో 40,460 మంది, రాజంపేట నియోజకవర్గంలో 23,568 మంది, రైల్వేకోడూరు నియోజకవర్గంలో 27,666, మదనపల్లె నియోజకవర్గంలో 22,735 మంది, పీలేరు నియోజకవర్గంలో 42548 రైతులు, తంబళ్లపల్లె నియోజకవర్గంలో 48,746 లబ్ధిదారులు ఉన్నారు.

రైతు ప్రభుత్వం రావాలి..



వ్యవసాయానికి భరోసా లేని పథకం ఇది. ఏడాదికి రూ.5,500 ఇస్తే.. దీంతో ఎలా వ్యవసాయం చేయాలి. అదీ వస్తుందో రాదో తెలియదు. వచ్చే అరకొర డబ్బులు రావడానికి ఎన్నో అడ్డంకులు ఉన్నాయి. పంట నమోదు, ఈకేవైసీలో ఇబ్బందులు ఉన్నాయి. నాకు మూడున్నర ఎకరాల భూమి ఉంది. ప్రతి సంవత్సరం సాగు చేస్తున్నాను. ఈ ఏడాది రైతు భరోసా ఇప్పటి వరకు రాలేదు. ఎన్నికలు వచ్చేశాయి. .ఇంక రానట్టే.. ప్రభుత్వం నుంచి ఈ నిధులు ఎప్పుడు వస్తాయో తెలియడం లేదు. మాటలు చెప్పే ప్రభుత్వం కాకుండా, రైతును ఆదుకునే ప్రభుత్వం రావాలి. అప్పుడే రైతు ప్రభుత్వంగా చెప్పుకుంటారు. రైతుల పేరుతో పెట్టే పథకాలకు కూడా మంచి ఫలితం ఉంటుంది.

-ఎం.ప్రభాకర్‌రెడ్డి, తాటిమాకులపల్లె, పెద్దమండ్యం

అర్హత ఉన్నా.. రైతు భరోసా రాలేదు..



కరోనా సమయంలో నా భర్త వెంకటరమణ చనిపోయాడు. మాకు గ్రామంలో ఐదు ఎకరాల పొలం ఉంది. వ్యవసాయమే మాకు ఆధారం. నా భర్త ఉన్నప్పుడు రైతు భరోసా సొమ్ము వచ్చేది. ఆయన మరణం తర్వాత.. భూమి హక్కులు నా పేరు మీద మార్చుకున్నా.. ఈ మూడు సంవత్సరాలు నాకు రైతు భరోసా రాలేదు. రైతు భరోసా సొమ్ము విషయమై ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా.. ఎవరూ పట్టించుకోలేదు. మాలాంటి రైతు కుటుంబాలకు వైసీపీ ప్రభుత్వం ఎలాంటి సాయం అందించలేదు.

- సిద్దమ్మ, వాల్మీకిపురం

రైతు భరోసా రాలేదు..



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. నా భర్త గోపాల్‌రెడ్డి ఐదేళ్ల క్రితం చనిపోయాడు. భూమి నా పేరు మీద ఉన్నా.. పీఎం కిసాన్ సహాయం అందుతోంది. వైసీపీ ప్రభుత్వం అందజేస్తున్న రైతు భరోసా ఐదేళ్లుగా అందలేదు. రైతు భరోసా కోసం దేవలచెరువులోని సచివాలయం చుట్టూ.. కాళ్లరిగేలా తిరిగినా.. ప్రయోజనం లేదు.

- కన్నెమడుగు పాపులమ్మ

పర్తికోట, ములకలచెరువు

పేరుకే రైతు భరోసా..!



రైతుకు భరోసా పథకం. రైతులకు సకాలంలో, కంతుల వారీగా సక్రమంగా అందడం లేదు. బటన్ నొక్కామని ప్రభుత్వం చెబుతుంది. ఆర్భాటంగా ప్రకటనలు కూడా చేస్తున్నారు. అంతా హడావిడే కానే.. తర్వాత బ్యాంకులకు వెళ్లి అకౌంట్ చెక్ చేస్తే ఏమీ ఉండదు. ప్రతి సంవత్సరం ప్రభుత్వం రూ.13,500 ఇస్తున్నట్లు చెబుతున్నా అది పడటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం రూ.7500, కేంద్ర ప్రభుత్వం మోదీ రూ.6 వేలు ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కంతుల వారీగా ఇచ్చే రూ.2 వేలు పడతాంది. కానీ జగన్ ఇచ్చే డబ్బులు పడటం లేదు. మొదట్లో రెండుసార్లు వరుసగా పడింది. నిన్న సంవత్సరం, ఈ సంవత్సరం డబ్బులు ఇంతవరకు రాలా. ఈసారి అయితే మోదీ ఇచ్చే డబ్బులు కూడా ఈ సంవత్సరం నాకు రాలేదు. ఇలా ఇద్దరు ఇచ్చే రూ.13,500 ఈ సంతవ్సరం రాలేదు. నాకు రెండు ఎకరాల పొలం ఉంది. ఇప్పటి వరకు సంవత్సరానికి రెండుసార్లు చొప్పున నాలుగు సార్లు డబ్బులు పడింది అంతే. తర్వాత రాలేదు.

- టి.కృష్ణప్ప, రైతు,
మట్లవారిపల్లె, రామసముద్రం

రాజంపేటలో వైసీపీకి భారీ షాక్

● నారా లోకేశ్ సమక్షంలో

పెద్దఎత్తున వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

రాజంపేట, ఏప్రిల్ 18: రాజంపేటలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. గురువారం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో హైదరాబాదులోని ఆయన స్వగృహంలో వైసీపీ నాయకులు, మేడా మల్లికార్జునరెడ్డి వర్గీయులు టీడీపీలో చేరారు. రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకుడు పోలి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు టీడీపీలో చేరగా ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు, సిద్దవటం మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ జవహర్‌బాషా పాల్గొన్నారు. టీడీపీలో చేరిన వారిలో నందలూరు మండలం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, నందలూరు మండల మాజీ అధ్యక్షుడు, ముదిరాజ్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ భువనబోయిన లక్ష్మీనరసయ్య, రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్ డైరెక్టర్, సీనియర్ మైనార్టీ నాయకుడు గడికోట గుల్జార్‌బాషా, రాజంపేట మున్సిపల్ కౌన్సిలర్లు, సీనియర్ బీసీ నాయకులు పసుపులేటి సుధాకర్, మనుబోలు వెంకటసుబ్బయ్య, మురళీ ఆచారి, నాయక్, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి, నందలూరు మైనారిటీ నాయకుడు సయ్యద్ అమీర్, అన్నపూర్ణేశ్వరి అగస్త్యేశ్వర స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకటరెడ్డి, రాజంపేట మైనారిటీ నాయకుడు షామీర్‌బాషా, ఇంకా అనేక మంది నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు.



నారా లోకేశ్ స్వగృహం వద్ద టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

వేణుగానాలంకారంలో దర్శనమిస్తున్న కోదండరాముడు



హంసవాహనంపై పట్టాభిరాముడి విహారం

● భారీ ఎత్తున భక్తుల హాజరు...

ఒంటిమిట్ట, ఏప్రిల్ 18: కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం రాత్రి హంస వాహనంపై సీతారామలక్ష్మణులు భక్తులకు అభయమిచ్చారు. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామి వారిని కీర్తిస్తుండగా అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆత్మానాత్మ వివేకం కలవానికి భగవదనుగ్రహం సంపూర్ణంగా కలుగుతుంది. హంస వాహనాల్లోని పరమార్థం ఇదే... హంసలో పాలను, నీళ్లను వేరుచేసే సామర్థ్యం ఉంది. భక్తులలో అహంభావం తొలగించి దాసోహం అనే భావం కలిగించడానికే పరమహంస రూపానికి ప్రతీక అయిన హంసవాహనాన్ని స్వామి వారు అధిరోహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం వేణుగానాలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలోని పురవీధుల గుండా భక్తులకు స్వామి వారు అభయమిచ్చారు. ఉదయం భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామి వారిని కీర్తిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి ఊరేగింపు కోలాహలంగా నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనంతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. ముందుగా సీతారామలక్ష్మణులకు ప్రత్యేకంగా అలంకరించి పసుపు గంధంతో అభిషేకం చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామాలయంలో ఊంజల్ సేవను టీటీడీ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు స్వామి వారు ఉదయం వటపత్రశాయి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అనంతరం స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ అనంతరం రాత్రికి సింహవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవోలు నటేష్‌బాబు, ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



హంసవాహనంపై ఊరేగుతున్న సీతారామ లక్ష్మణులు

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

● ప్రశాంత ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి ● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, చిత్రంలో ఎస్పీ కృష్ణారావు

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 18: ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల నిర్వహణపై ఎస్పీ కృష్ణారావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. బుధవారం నోటిఫికేషన్ వచ్చిందని, ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారని, 26వ తేదీ స్క్రూటినీ, 29వ తేదీ విత్‌డ్రాలు ఉంటాయన్నారు. 29వ తేదీ తర్వాత నియోజకవర్గాల వారీగా ఎంతమంది అభ్యర్థులు బరిలో ఉండేది తెలుస్తుందన్నారు. ఎన్నికలకు సంబంధించి పార్లమెంటుకు రెండు, రాజంపేట అసెంబ్లీకి 2 నామినేషన్లు, మదనపల్లె-1, పీలేరు-4, కోడూరు-1, తంబళ్లపల్లె-1 మొత్తం 11 నామినేషన్లు వేసినట్లు తెలిపారు. నామినేషన్ల దాఖలు సమయంలో గరిష్టంగా 3 వాహనాలు అనుమతించబడతాయని, 5 మంది వ్యక్తులు (అభ్యర్థితో సహా) ఆర్వో ఆఫీస్‌లోకి అనుమతి ఇస్తామన్నారు. జిల్లాలో ఓటర్ల సంఖ్య 14,21,196 మంది కాగా, 1609 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని నియోజకవర్గాల వారీగా కొన్ని మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇందుకు సంబంధించిన మన జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఎర్రచందనంను ఒక టీమ్ తీసుకుని మోడల్ పోలింగ్ కేంద్రాలను రూపొందిస్తామన్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మహిళా ఓటర్లకు, విభిన్న ప్రతిభావంతులకు కొన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పోలింగ్ విధుల్లో భాగస్వాములుగా ఉన్న వారందరికీ పోస్టల్ బ్యాలెట్ ఇస్తామని, ఇందులో ముఖ్యమైన 33 డిపార్టుమెంట్‌ల వారితో పాటు పాత్రికేయులకు కూడా ఫారం-12 ఇస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్లు ఫిల్ చేసి నోడల్ ఆఫీసర్ ద్వారా ఆర్వోకు సబ్మిట్ చేయాల్సి ఉంటుందన్నారు. మే 2వ తేదీ కల్లా పోస్టల్ బ్యాలెట్లు వస్తాయని, మే 5 నుంచి 8వ తేదీ వరకు నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్ కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న 18004257090 నెంబర్‌కు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు ఆరుగురు అబ్జర్వర్లు కేటాయించారని కలెక్టర్ తెలిపారు. మన జిల్లాకు కేటాయించిన అబ్జర్వర్లు జిల్లాలో ఏమేమి జరిగేది స్వతహాగా చూసి ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తారని తెలిపారు.

జిల్లాలో తొలిరోజు 11 నామినేషన్లు




నల్లారి కిశోర్



షాజహాన్‌బాషా

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 18: జిల్లాలో తొలిరోజు మొత్తం 11 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో రాజంపేట పార్లమెంటుకు సంబంధించి రెండు నామినేషన్లు వేశారు. ఒకటి స్వతంత్ర అభ్యర్థిది కాగా.. మరొకటి వైసీపీ నుంచి ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తరఫున ఆయన తల్లి పెద్దిరెడ్డి స్వర్ణలత రాయచోటిలో రిటర్నింగ్ అధికారి అభిషిక్త్ కిశోర్‌కు నామినేషన్ అందజేశారు. పీలేరు అసెంబ్లీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి గురువారం పీలేరు ఎన్నికల అధికారి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు నామినేషను పత్రాలు అందచేశారు. కుటుంబ సమేతంగా ఎన్నికల కార్యాలయానికి వెళ్లిన కిశోర్‌కుమార్ రెడ్డి రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అనంతరం ఆయన సతీమణి నల్లారి తనూజారెడ్డి, కిశోర్‌కుమార్ రెడ్డి తనయుడు డాక్టర్ నల్లారి అమరనాథ రెడ్డి కూడా టీడీపీ అభ్యర్థులుగా నామినేషన్ పత్రాలు ఎన్నికల అధికారికి అందచేశారు. మదనపల్లె నియోజకవర్గానికి తొలి రోజున తొలిబోణి టీడీపీ అభ్యర్థిదే పడింది. ఉమ్మడి కూటమి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా నలుగురు అనుచరులతో వెళ్లి నిరాడంబరంగా రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్‌కు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. రాజంపేట, రైల్వేకోడూరు, తంబళ్లపల్లెలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, తంబళ్లపల్లెలో పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, నామినేషన్లు దాఖలు చేశారు. కాగా రాజంపేట, మదనపల్లె, పీలేరు, రైల్వేకోడూరు, తంబళ్లపల్లె అసెంబ్లీ నియోజకవర్గాలకు స్వతంత్ర అభ్యర్థులతో కలిపి మొత్తం 11 నామినేషన్లు వచ్చాయి. రాయచోటి అసెంబ్లీ నియోజవర్గానికి ఒక్క నామినేషన్ కూడా రాలేదు.




ఇల వైకుంఠపురం..

● రమణీయంగా సాగిన పట్టాభిరాముడి రథోత్సవం

● రామనామ స్మరణతో మార్మోగిన వాల్మీకిపురం

వాల్మీకిపుర వీధులలో వైభవంగా రాముడి రథోత్సవం





వాల్మీకిపురం, ఏప్రిల్ 18: శ్రీరామ..జయ జయ రామ..పట్టాభిరామ.. అంటూ రామ నామ స్మరణలతో వాల్మీకిపురం మార్మోగింది. పట్టాభిరాముడి క్రోధినామ సంవత్సర సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం టీటీడీ ఆధ్వర్యంలో రాముడి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో మొదలు ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉత్సవమూర్తులైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడిని విశేష అలంకరణలతో బ్రహ్మరథంపై అధిష్టింప చేశారు. తొలిపూజ అనంతరం విశేష భక్తజనం నడుమ పట్టాభిరాముడి రథోత్సవ కార్యక్రమం రమణీయంగా సాగింది. పురవీధుల గుండా జరిగిన ఈ వైభవానికి సమీప ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. తిరుమాడ వీధుల్లో భక్తులు రథంపై మిర్యాలు, బొరుగులు చల్లుతూ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల కోసం డ్రైవర్స్ అసోసియేషన్, వాసవీ సంఘం, మానవతా సేవా సంస్థ, సాయి నారాయణ సేవ, వివిధ సేవా సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. మధ్యాహ్నం స్థానిక హరిమందిరం వద్దకు చేరుకున్న బ్రహ్మరథం విరామం అనంతరం తిరిగి సాయంత్రం 4 గంటలకు భక్తుల నడుమ యథాస్థలికి చేరుకుంది. ఈ సందర్భంగా భారీ బాణాసంచా గ్రామీణ ప్రాంతాల కోలాటలు, చెక్కభజనలు, టీటీడీ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, కృష్ణప్రసాద్, కృష్ణరాజు, భాషికాచార్యులు, రామ్‌గోపాల్ బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రాముడి బ్రహ్మోత్సవాలలో ముస్లింల సేవ..

పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా హిందూ ముస్లింలంతా ఐకమత్యంగా ఉత్సవాలలో పాల్గొంటుండటం గమనార్హం. గురువారం పట్టాభిరాముడి రథోత్సవం సందర్భంగా స్థానిక హరిమందిరం వద్ద భక్తులకు ముస్లింలు మజ్జిగ, తాగునీరు, శీతల పానీయాలు పంపిణీ చేశారు. మా ఊరి బ్రహ్మోత్సవాలలో మా వంతు సేవ అంటూ ముస్లింలు కార్యక్రమాలు చేపట్టి మతసామరస్యాన్ని చాటారు. పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం అశ్వవాహన సేవ, పార్వేట ఉత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి.



మజ్జిగ ప్యాకెట్లు, శీతల పానీయాలు పంపిణీ చేస్తున్న ముస్లింలు

పార్టీలు మారినా...

రాజంపేట, ఏప్రిల్ 18: ఆ నాయకుడి గురించి ఇటు ఉమ్మడి కడప జిల్లాలోనూ, అటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనూ తెలియని వారుండరు. రాష్ట్రంలో తొలిసారి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు రాజంపేట ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన మొట్టమొదటి నేత గంటా నరహరి. రెండేళ్ల కిందట ఆయనను రాజంపేట టీడీపీ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత ఏడాదిగా పార్లమెంటు పరిధిలో తిరిగారు. అనంతరం ఆయన రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని ఇక్కడ అనేక కార్యక్రమాలు చేపట్టారు. అటు ఎంపీగా, ఇటు ఎమ్మెల్యేగా అయినా రాజంపేటలో ఇక పోటీ చేస్తారు అనుకున్న దశలో ఈయన దిశ మారిపోయింది. రాజంపేట టీడీపీ నుంచి ఏవో కారణాల వల్ల ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు రాకపోవడంతో ఒక్కసారిగా పార్టీని వీడి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో జనసేన కండువా కప్పుకున్నారు. వెనువెంటనే తిరుపతి ఎమ్మెల్యే టికెట్టు జనసేన తరపున కేటాయించినట్లు ప్రచారం జరిగిపోయింది. ఇంతలో రెండురోజుల్లోనే అక్కడ వేరే అభ్యర్థిని ప్రకటించడంతో రాత్రికి రాత్రే కండువా మార్చేసి రాజంపేట ఎంపీ స్థానానికి పోటీ చేయాలనుకున్న తన ప్రత్యర్థి వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. అక్కడైనా టికెట్టు దొరికిందా అంటే.. అక్కడా ఏమీ లేదు. చివరికి వైసీపీ అభ్యర్థుల నామినేషన్‌లో పాల్గొని అందరికీ నమస్కారాలు చేసుకోవడం అది చూసిన వారికి చూడముచ్చటగా మారింది.

మరపురాని సన్నివేశం



తన తండ్రి కోసం ఏనుగుపై ప్రచారం చేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం (ఫైల్)

గజరాజుపై సుగవాసి

రాజంపేట, ఏప్రిల్ 18: ఈ చిత్రాన్ని ఒకసారి మనం పరిశీలిస్తే చాలా తమాషాగా ఉంటుంది... ప్రస్తుతం రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం చిన్ననాటి చిత్రం. ఈ చిత్రం 1983వ సంవత్సరం నాటిది. ఆనాడు తన తండ్రి సుగవాసి పాలకొండ్రాయుడు స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయనకు ఏనుగు గుర్తు లభించడంతో ఆనాడు ఏనుగును తెప్పించి అట్టహాసంగా ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. తన తండ్రి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో తన తండ్రికి కేటాయించిన ఏనుగు గుర్తు అందరూ గుర్తు పెట్టుకునేలా ర్యాలీకి తీసుకొచ్చిన ఏనుగుపై రెండవ అబ్బాయిగా పంచెకట్టుకొని అందరికీ నమస్కరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఆనాడు తీసిన బ్లాక్ అండ్ వైట్ ఫొటో ఈనాటికీ పదిలంగా ఉంది. ప్రస్తుత ఎన్నికల సమయంలో సుగవాసి బాలసుబ్రమణ్యం రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సందర్భంగా ఈ అరుదైన ఫొటో అందరికీ ఆసక్తిగా మారింది.

చెన్నకేశవస్వామి.. నీవే దిక్కయ్యా..!





గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయం

ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించే సమయంలో రాజకీయ నాయకులు మంచి ముహూర్తం చేసుకుంటారు. అచ్చొచ్చిన ఊరు, ఆలయం, మండలం ఇలా ఏదో ఒకటి ఎంచుకుంటారు. రాజకీయ నాయకులకు అచ్చొచ్చిన ప్రాంతం తంబళ్లపల్లె నియోజకవర్గంలో కూడా ఉంది. పెద్దతిప్పసముద్రం పంచాయతీ బూచిపల్లిలోని చెన్నకేశవస్వామి అనుగ్రహం కోసం పూజలు చేసి ప్రచారం మొదలు పెట్టడం ఇక్కడి నాయకులకు సెంటిమెంట్‌గా మారింది. ఇక్కడ పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభిస్తే ఎన్నికల్లో కలిసొస్తుందని ప్రధాన పార్టీల అభ్యర్థులు విశ్వసిస్తున్నారు.

● సెంటిమెంటు...!

తంబళ్లపల్లె నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తొలుత ఇక్కడున్న చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. అలాగే వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కూడా ఇక్కడ ఆలయంలో పూజలు చేసిన అనంతరం ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అసెంబ్లీ బరిలో నిలిచే అభ్యర్థులు చెన్నకేశవస్వామిని దర్శించుకోవడం సెంటిమెంటుగా భావిస్తున్నారు.

- ములకలచెరువు

పంతులు గారూ...ముహూర్తం చూడండి

● పురోహితులను సంప్రదిస్తున్న అభ్యర్థులు

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఎన్నికల సందడి మొదలైంది. ప్రస్తుతం పొలిటికల్ ముహూర్తాల సమయం నడుస్తోంది. నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు పురోహితులు, పండితులు, జ్యోతిష్యులను ఆశ్రయిస్తున్నారు. పేరు, రాశి బలాల మీద నామినేషన్ల తేదీలను ఖరారు చేసుకుంటున్నారు. తేదీకి తోడు సమయం కూడా అచ్చొచ్చేలా చూసుకుంటున్నారు. రాజకీయ పార్టీల నేతలకు ఎన్నికల్లో టికెట్ దక్కించుకోవడం ఒక ఎత్తయితే ఆ తరువాత విజయం సాధించడానికి దేవుడి ఆశీస్సులు అవసరమని భావిస్తున్నారు. దీంతో తమకు తెలిసిన పండితులు, పురోహితులను సంప్రదిస్తున్నారు. వారిచ్చిన తేదీ, సమయాన్ని బట్టి నామినేషన్లు దాఖలు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు.

● మంచి ముహూర్తం కోసం

- ములకలచెరువు

బీ..ఫారం... ఏ-ఫారం అంటే...

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది ఎన్నికల సమయంలో ఏ-ఫారం, బీ- ఫారం అనే పదాలు తరచూ వింటుంటాం. గుర్తింపు పొందిన ప్రాంతీయ లేదా జాతీయ రాజకీయ పార్టీలు తమ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఇతనే అని ఇచ్చే ధ్రువీకరణ పత్రమే ఇది. ఈ ఫారాన్ని పార్టీ అధ్యక్షుడు గానీ, ప్రత్యేక ప్రతినిధి గానీ అభ్యర్థులకు అందిస్తారు. నామినేషన్ వేసే సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అవసరమైన పత్రాలతో పాటు బీ-ఫారంను దాఖలు చేయాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రంతో పాటైనా లేదా పరిశీలన సమయంలో రిటర్నింగ్ అధికారికి బీ-ఫారం అందించాల్సి ఉంటుంది. ఇలా బీ-ఫారం సమర్పించిన అభ్యర్థికే ఎన్నికల కమిషన్ పార్టీల గుర్తులను కేటాయిస్తుంది. లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తారు. పార్టీ అధ్యక్షుడు లేదా పార్టీ నియమించిన ప్రత్యేక ప్రతినిధి అభ్యర్థులకు బీ-ఫారం అందిస్తారు. ఆ అధికారాన్ని ఆయనకు అప్పగిస్తూ ఇచ్చేదే ఏ-ఫారం. దీనిని తీసుకున్న వ్యక్తికే అభ్యర్థులకు బీ-ఫారం ఇచ్చే అధికారం ఉంటుంది. ఫారం తీసుకున్న వ్యక్తి దానిని ఎన్నికల అధికారికి సమర్పించి తానే బీ-ఫారం ఇచ్చినట్లు స్పష్టం చేయాల్సి ఉంటుంది.

తెలుసుకుందాం ...

- ములకలచెరువు

అంతా వారి గుప్పిట్లోనే..!



- అభివృద్ధి సున్నా.. ఆధిపత్యం మిన్న
- వనరులను లేకుండా చేసిన వైసీపీ పాలకులు
- ఒకే సామాజిక వర్గం చేతిలో రాజంపేట
- అన్నమయ్య ప్రాజెక్టు తెగినా ఇంతవరకు ఒక ఇల్లు పూర్తి చేయలేని పెద్దలు
- ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజంపేట సర్వనాశనం

రాజంపేట, ఏప్రిల్ 18: ఉమ్మడి కడప జిల్లాలో రాజంపేట నియోజకవర్గం శాంతికి మారుపేరుగా నిలిచింది. అన్నమయ్య జన్మస్థలిగా, బ్రిటీషు కాలం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయ కేంద్రంగా, పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రంగా వెలసిల్లుతున్న ఈ ప్రాంతాన్ని వైసీపీ పాలకులు అధికారంలోకి వచ్చిన వెంటనే సర్వనాశనం చేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఇద్దరూ ప్రధాన వైసీపీ ప్రజాప్రతినిధులు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదు. అవినీతిలో ఒకరికొకరు పోటీపడుతూ కోట్ల రూపాయల సొమ్మును మూటగట్టుకున్నారు. ఒకే సామాజికవర్గం చేతిలో రాజంపేట నియోజకవర్గం కొట్టుమిట్టాడుతోంది. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఒకరికొకరు పోటీ పడుతూ సొమ్మును వెనకేసుకున్నారే తప్ప అభివృద్ధి శూన్యమే. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తన చిన్నాన్న, తమ్ముడు, ఇతర కుటుంబ సభ్యుల పేర్లతో నందలూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో వందల ఎకరాలు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని ప్రభుత్వ సొమ్ముతో వాటిని అభివృద్ధి పరిచి భూకబ్జాల ఎమ్మెల్యేగా వాసికెక్కాడు. తన హయాంలో భారీ ఎత్తున ఇసుక దోపిడీకి పాల్పడి కోట్ల రూపాయలు సంపాదించాడు. కేవలం తన సామాజిక వర్గానికే కొమ్ముకాస్తూ బలహీన వర్గాలను అణగదొక్కారు. తన తమ్ముడు మేడా రఘునాథరెడ్డికి రాజ్యసభ పదవిని, తనకు ఎమ్మెల్యే పదవిని, తన చిన్నాన్న మేడా విజయభాస్కర్‌రెడ్డికి మండలాధ్యక్ష పదవిని, తన తమ్ముడు రాజశేఖర్‌రెడ్డికి సర్పంచ్ పదవిని ఇచ్చి అన్ని పదవులను గుత్తాధిపత్యంగా ఉంచుకున్నాడు. తన మండల జడ్పీటీసీ పదవి, నియోజకవర్గంలో మున్సిపల్ చైర్మన్ పదవి, తన మండల జడ్పీటీసీ పదవిని సైతం సామాజికవర్గానికే కట్టబెట్టారు. ఎందుకూ పనికి రాని డైరెక్టరు, వైస్ చైర్మన్, మండల ఉపాధ్యక్ష పదవులను ఇతర సామాజిక వర్గాలకు ఇచ్చి సామాజిక న్యాయం చేశామని చెప్పుకోవడం హాస్యాస్పదమైన అంశం. ఇక జడ్పీ చైర్మన్, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి కొండలను సైతం కబ్జా చేసి ప్రభుత్వ సొమ్ముతో కొండలపై సిమెంటు రోడ్లు వేసుకుని సామంతరాజులా గుర్రాలపై సవారీ చేస్తూ కొండలపై విలాసవంతమైన ఇంటిని కట్టుకుని బినామీ పేర్లతో వందల ఎకరాలు కబ్జా చేసి అభివృద్ధిని అటకెక్కించారు. ఈ విధంగా మేడా, ఆకేపాటి ఇరువురు నేతలు తమ సామాజికవర్గానికి, తమ కుటుంబీకులనే అందలం ఎక్కించి అన్ని వర్గాలను అణగదొక్కి సామాజిక న్యాయం పాటించినట్లు చెప్పుకోవడం అందరూ నవ్వుకునే అంశం.

అన్నమయ్య బాధితులకు ఒక్క ఇంటినైనా కట్టించారా..?

హృదయ విదారక ఘటన అన్నమయ్య ప్రాజెక్టు వ్యవహారం. ఈ ప్రాజెక్టును దిగువ ప్రాంతంలో ఇసుక దోపిడీని చేసుకోవడానికి ఒకరికొకరు పోటీలు పడి ప్రాజెక్టు నుంచి దిగువ ప్రాంతాలకు నీరు రాకుండా వైసీపీ నేతలు అడ్డుకోవడం, ప్రాజెక్టు తెగిపోయి సుమారు 40 మంది మృతి చెందడం, 400 ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. సుమారు ఐదు గ్రామ పంచాయతీలు మునిగిపోయాయి. రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల పరిధిలోని చెయ్యేరు పరివాహక ప్రాంతాలు నీటిపాలయ్యాయి. ఈ సంఘటన జరిగి రెండేళ్ల నాలుగు నెలలు దాటుతున్నా ఇంతవరకూ బాధితులకు ఒక్క ఇంటి నిర్మాణాన్ని కూడా పూర్తి చేయించలేదు. వారు ఎండకు, వానకు ఇబ్బందులు పడుతూ ఆ గ్రామాలను వదిలి ఇతర గ్రామాల్లో జీవనం సాగిస్తున్నారు. ప్రాజెక్టు పునఃనిర్మాణానికి చర్యలు చేపట్టకపోవడంతో అన్నమయ్య ప్రాజెక్టు అధోగతి పాలైంది. ఈ ప్రాజెక్టును వెంటనే పునర్ నిర్మిస్తామన్న సీఎం హోదాలో జగన్, స్థానిక ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ హామీలు గాలిమూటలయ్యాయి.

అతీగతి లేని ఆల్విన్ ఫ్యాక్టరీ

నందలూరులో ఆల్విన్ ఫ్యాక్టరీ మూతపడి 15 ఏళ్లు కావస్తోంది. ఈ ఫ్యాక్టరీ స్థానంలో కొత్త పరిశ్రమను తెస్తామని ఇదే ప్రాంతంలో గతంలో మూసివేసిన లోకోషెడ్డు స్థానంలో ట్రాక్షన్ షెడ్డు ఏర్పాటు చేస్తామన్న వైసీపీ నేతల హామీలు పూర్తిగా కనుమరుగయ్యాయి.

ఎత్తిపోయిన శ్రీరామ ఎత్తిపోతల పథకం

ఒంటిమిట్టలో కోదండరామాలయ అభివృద్ధి పనుల్లో భాగంగా ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుక జలాల నుంచి రూ.36 కోట్లతో శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా చెరువుకు నీరందించే పథకం మూలనపడ్డా దానిని ఇంతవరకు పునరుద్ధరించలేదు. ఎత్తిపోతల పథకం మోటార్లు చెడిపోయి సోమశిల వెనుక జలాలకు వేయాల్సిన పైపుల పునరుద్ధరణ జరగలేదు. ఫలితంగా అవి మూలనపడడంతో ఒంటిమిట్ట చెరువుకు నీరు రాక 36 కోట్ల నీటి పథకం ఎందుకూ కొరగాకుండా పోయింది. ఒంటిమిట్ట కోదండరామాలయ వంద కోట్ల మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులు ఇంకా 50 శాతం పూర్తి కాకున్నా వాటిపై చర్యలు తీసుకోలేదు. కల్యాణ మండపం అర్ధభాగమే పూర్తయింది. సిద్దవటం మండలానికి ఒక్క అభివృద్ధి పనీ చేయలేదు. నియోజకవర్గంలో వీరబల్లి, సుండుపల్లి మండలాలను ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ గ్రామాలకు కనీసం రోడ్లు, రక్షిత మంచి నీటి పథకాలను కూడా ఏర్పాటు చేయలేదు.


జిల్లా కేంద్రం హామీ సైతం అటకెక్కించిన నేతలు

రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని హామీ ఇచ్చి మోసగించారు. రాజంపేటలో జన్మించిన అన్నమయ్య నామాన్ని జిల్లా కేంద్రానికి పెట్టి రాజంపేటలో ఉన్న అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకను కూడా అభివృద్ధి చేయకుండా గాలికి వదిలేశారు. పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రం రాజంపేటలో ఇంత వరకు రింగురోడ్డు లేకపోగా ఇరుకిరుకు రోడ్లతో వాహనాలు పట్టణంలోకి వెళ్లలేక ప్రజలు ట్రాఫిక్‌తో అవస్థలు పడుతూ నిత్యం రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. పట్టణానికి ఆనుకుని చక్రాలమడుగును వెడల్పు చేసి సుందరీకరిస్తామన్న వారి హామీలు పూర్తిగా నీరుగారిపోయాయి. రైల్వే అండర్ బ్రిడ్జిని కేంద్ర నిధులతో పూర్తి చేసినా రాష్ట్ర ప్రభుత్వం అండర్ గ్రౌండ్ రోడ్డును సైతం నిర్మించలేని దీనావస్థలో వైసీపీ పాలకులు ఉండడం పట్టణ ప్రజలు చేసుకున్న దౌర్భాగ్య పరిస్థితి. వంద కోట్లతో రాజంపేట పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్న వీరి హామీలు విని ప్రజలు ముక్కున వేలేసుకునే పరిస్థితికి వచ్చారు.

కొసమెరుపు

ఒక్క మాటలో చెప్పాలంటే రాజంపేట నియోజకవర్గంలోని ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ తమ సామాజికవర్గాన్నే రాజకీయంగా, రాజ్యాంగ పదవుల్లో ఆకాశానికెత్తి మిగిలిన వర్గాలను అణగదొక్కి తమ సామాజికవర్గ నేతలే నియోజకర్గంలోని ఆరు మండలాల్లో సహజసంపదలైన అడవులు, గుట్టలు, వాగులు, వంకలు, చెరువులను కబ్జా చేసి అన్ని పదవులను వారే అనుభవిస్తూ అభివృద్ధి చేశామని, సామాజికన్యాయం చేశామని చెప్పుకోవడమే ఓ వింతైన విషయం.





అనాథలా అన్నమయ్య ప్రాజెక్టు ఆనవాళ్లు

శిథిలమైన నందలూరు ఆల్విన్ కర్మాగారం



ఇంకా పూర్తి కాని అన్నమయ్య ప్రాజెక్టు ముంపుబాధితుల ఇళ్లు



ఓటర్లలో సగం మంది నారీమణులే

● సీట్లు మాత్రం నలుగురికే

కడప, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం రోజున జరిగే కార్యక్రమాల్లో మహిళలను రాజకీయపార్టీల నేతలు ఆకాశానికి ఎత్తేస్తుంటారు. నారీమణులు లేనిదే మనుగడ కష్టం అనేలా ఉపన్యాసాలు ఇస్తుంటారు. అయితే ఎన్నికలకు సంబంధించి టికెట్ల విషయంలో మాత్రం ఆ మేరకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మహిళలకు కేటాయించిన సీట్లను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. జిల్లాలో మొత్తం ఓట్లు గురువారం సాయంత్రం వరకు 16,21,760 మంది ఉన్నారు. పురుషులు 7,92,371 ఉండగా, స్త్రీల ఓట్లు 8,29,175 మంది ఉన్నారు. అంటే పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువ ఉన్నారు. అయితే సీట్ల కేటాయింపులో మాత్రం టీడీపీ కడప నియోజకవర్గం నుంచి ఆర్.మాధవిని బరిలో దింపుతుండగా, వైసీపీ బద్వేలు నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సుధకే తిరిగి టికెట్ ఇచ్చింది. ఇక కాంగ్రెస్ నుంచి కడప పార్లమెంట్‌కు ఎంపీగా వైఎస్ షర్మిల పోటీ చేస్తుండగా, బద్వేలు నుంచి విజయజ్యోతి పోటీచేయనున్నారు. ఇంకా కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించలేదు. ఇప్పటి దాకా చూస్తే ఓటర్లలో సగం మందికి పైగా ఉన్న మహిళలకు నాలుగు సీట్లే కేటాయించడం గమనార్హం.

వ్యూహం బెడిసికొట్టింది

రాజీనామాకు ఒప్పుకోని వలంటీర్లు

- చంద్రబాబు భరోసాతో తిరగబడుతున్న వైనం
- కక్కలేక..మింగలేక.. ఏమీ చేయలేక
- చూస్తుండిపోతున్న వైసీపీ నేతలు



మదనపల్లె, ఏప్రిల్ 18: ఇంతకాలం ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా చెప్పుకొస్తున్న వలంటీర్లను రాజీనామా చేసి ప్రత్యక్షంగా ఎన్నికల విధుల్లో పాల్గొనాలన్న వైసీపీ నేతల వ్యూహం బెడిసికొడుతోంది. ఇంతకాలం తమ సేవలు వినియోగించుకుని, ఇప్పుడు కాదంటారా? అంటూ వలంటీర్లు వైసీపీ నేతలపై మండిపడుతున్నారు. తమ సేవల వల్లనే అటు ప్రభుత్వానికి, ఇటు పార్టీకి మంచి పేరు వచ్చిందని ప్రచారం చేసుకుని.. గొప్పలు చెప్పుకున్న వైసీపీ నాయకులు, ఇప్పుడు అవసరం తీరాక బోడిమల్లన్న అంటారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల కమిషన్ జోక్యంతో వారంతా ఎన్నికల విధుల్లోనే కాదు..పింఛన్ల పంపిణీకి దూరంగా ఉన్నారు. అలాగే ప్రచారంలో పాల్గొనకుండా అడ్డుకట్ట పడటంతో వైసీపీ ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ నాయకులు వలంటీర్ల సేవలను వినియోగించుకోవడానికి శతవిధాలా ప్రయత్నించారు. అవకాశం ఉన్న అన్ని దారులు మూసుకుపోవడంతో చివరకు రాజీనామా అస్త్రాలను తెరపైకి తెచ్చారు. ఈ క్రమంలో ఇప్పటికే కొంతమంది రాజీనామాలు చేసి ఎన్నికల విధుల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. అంతలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు వలంటీర్లకు వరాలు ప్రకటించారు. తాము అధికారంలోకి రాగానే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, ఆ వ్యవస్థను ఎక్కడా తీసేయమని భరోసా ఇచ్చారు. అంతేకాదు..వారికి గౌరవవేతనం రూ.10 వేలు ఇస్తామని బంపర్ ఆఫర్ ప్రకటించారు. అంతే వలంటీర్లలో ఎక్కడ లేని ఉత్సాహం, ఉద్యోగ భద్రత ఏర్పడింది. దీంతో అప్పటి వరకూ వైసీపీకి వీరాభిమానులుగా ఉన్న వారు కూడా ఒక్కసారిగా మారిపోయారు. ఇంతకాలం రూ.5 వేలతో తమ వద్ద ఊడిగం చేయించుకున్న జగన్ ప్రభుత్వంపై.. చంద్రబాబు భరోసాతో తిరగబడుతున్నారు. దీనిని పసిగట్టిన స్థానిక వైసీపీ నాయకులు..వలంటీర్లపై వారం రోజులుగా ఒత్తిడి మొదలుపెట్టారు. వీరితో రహస్య సమావేశాలు ఏర్పాటు చేసి.. తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరిన్ని పథకాలు, మరింత లబ్ధి చేకూరుస్తామని తాయిళాలు వేస్తున్నారు. వీరి మాటలు, హామీలు లెక్క చేయని చాలామంది వలంటీర్లు టీడీపీ అధికారంలోకి వస్తే మాకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెగేసి చెబుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మున్సిపాలిటీలలో అధికార పార్టీ కౌన్సిలర్లు, మండల, గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు రాజీనామా చేయాలని వలంటీర్లపై ఒత్తిడి చేస్తున్నారు. రాజీనామా చేయకుంటే పార్టీ అభ్యర్థుల ప్రచారంలో పాల్గొనాలని సూచిస్తున్నారు. ఈ రెండూ చేయకుంటే తామంతట తామే విధులు, ఉద్యోగం నుంచి మిమ్మల్ని తొలగిస్తామని బెదిరిస్తున్నారు. తమకు ఇప్పటికే 35 ఏళ్లు దాటిపోయాయని, ఇప్పటికిప్పుడు రాజీనామా చేస్తే..తర్వాత తమ పరిస్థితి ఏంటని వలంటీర్లు వైసీపీ నాయకులను ప్రశ్నిస్తున్నారు. వయస్సు దాటిన తమకు ఎవరు ఉద్యోగం, ఎక్కడిస్తారని వాదిస్తున్నారు. తమ ప్రభుత్వం రాగానే తిరిగీ వలంటీరుగా తీసుకుంటామని చెబుతున్నా.. వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని గ్యారెంటీ ఏముందంటున్నారు. తమ పనితీరు, చదువు, వయస్సును పరిగణలోకి తీసుకునే, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అక్కున చేర్చుకున్నారని, ఆ అవకాశాన్ని వదులుకోమని చెబుతున్నారు. మీరు చెబుతున్నట్లు.. ఇప్పటికిప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాలను కాదని, ఎన్నికల విధులు, ప్రచారంలో పాల్గొనలేమని తెగేసి చెబుతున్నారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాన్వేషణలో ఉంటూ కేసులు ఎదుర్కోలేమని వాపోతున్నారు. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండని వాదిస్తూ, అటు రాజీనామాలు చేయకుండా, అటు ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా దూరంగా ఉంటున్నారు. ఇదిలా వుండగా, కొందరు మాత్రం వివిధ కారణాలతో పార్టీకి వీరవిధేయతగా, స్థానిక నాయకులు బంధువులుగా, అనుచరులుగా ఉన్నవారు మాత్రం అక్కడక్కడా రాజీనామా చేస్తూ, ఎన్నికల విధులకు దగ్గరవుతున్నారు.

పసిడిపురిలో అమాత్యులేరీ..?



25 ఏళ్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచిన వరదరాజుల రెడ్డి

వ్యాపారానికి, కవులకు, కళాకారులకు కొదవలేని పసిడిపురిని ఇంతవరకూ ఒక్క మంత్రి పదవీ వరించలేదు. ఇప్పటికి 16 పర్యాయాలు ఎన్నికలు జరిగితే ఒక్క పర్యాయం ఆర్యవైశ్యులకు, 15 పర్యాయాలు రెడ్ల సామాజిక వర్గీయులే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఇంత ఘనత వహించిన ప్రొద్దుటూరు నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్క పర్యాయం కూడా మంత్రి పదవి దక్కక పోవడం గమనార్హం. 1952లో ప్రొద్దుటూరు నియోజకవర్గం ఏర్పడింది. 62 ఏళ్ళుగా ఈ నియోజకవర్గం నుంచి 16 దఫాలుగా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ నియోజకవర్గం నుంచి ఒక్కసారంటే ఒక్కసారి కూడా ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలకు రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం దక్కలేదు.

- 16 దఫాలుగా జరిగిన అసెంబ్లీ ఎన్నికలు
- మంత్రి పదవికి నోచుకోని నియోజకవర్గం
- పాతికేళ్ళపాటు సాగిన వరదరాజులరెడ్డి హవా
- మూడోసారి ముచ్చటగా బరిలో రాచమల్లు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 18: ప్రొద్దుటూరుకు 16 సార్లు ఎన్నికలు జరిగితే అందులో 1957లో ఒక్కసారి మాత్రం ఉప ఎన్నిక జరిగింది. ఇందులో కాంగ్రెస్ కాంగ్రెస్ (ఐ) తరపున తొమ్మిది సార్లు, టీడీపీ తరపున మూడుసార్లు, ఇండిపెండెంటు రెండు సార్లు, వైసీపీ అభ్యర్థులు రెండు సార్లు గెలిచారు. 1952 మొదటిసారి ప్రొద్దుటూరు నియోజకవర్గంకు జరిగిన ఎన్నికల్లో మొత్తం ఓట్లు 68,162 ఓట్లు వుండగా అందులో పోలైనవి 45,535 ఓట్లు. కందుల బాలనారాయణరెడ్డి కాంగ్రెస్ నుంచి 15,054 ఓట్లతో పాణ్యం ఎర్రమునిరెడ్డి (కేఎంపీపీ)పై గెలిచారు. ఆ తర్వాత రెండో సారి 1955లో జరిగిన ఎన్నికల్లో మొత్తం 64,618 ఓట్లకు 42,648 ఓట్లు పోలవగా సీపీఐ అభ్యర్థి రామిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డి (చంద్రన్న)పై కాంగ్రెస్ అభ్యర్థిగా కందుల బాలనారాయణరెడ్డి 23,563 ఓట్లతో గెలిచారు. చంద్ర ఓబులరెడ్డికి 19,085 ఓట్లు వచ్చాయి. 1957లో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరిగింది. నాడు మొత్తం ఓట్లు 67,465 ఓట్లలో 46,281 పోలైతే చెల్లుబాటు అయినవి 46,121. ఇండిపెండెంట్‌గా రామిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి పాణ్యం ఎర్రమునిరెడ్డిపై 28,088 ఓట్లతో గెలిచారు. పాణ్యం ఎర్రమునిరెడ్డికి 16,419 ఓట్లు వచ్చాయి. 1962లో జరిగిన ఎన్నికల్లో పాణ్యం ఎర్రమునిరెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి చంద్ర ఓబుళరెడ్డిపై గెలిచారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థి ఆర్ రామసుబ్బారెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థి పాణ్యం ఎర్రమునిరెడ్డిపై గెలిచారు. 1972లో ఆర్యవైశ్యకులానికి చెందిన కొప్పరపు సుబ్బారావు కాంగ్రెస్ అభ్యర్థిగా సీపీఐ అభ్యర్థి ఐ సుబ్బారెడ్డిపై విజయం సాధించారు. 1978లో కాంగ్రెస్ అభ్యర్థిగా చంద్ర ఓబులరెడ్డి, జనతాపార్టీ అభ్యర్థి జి.పుల్లారెడ్డిపై గెలుపొందారు. ఇప్పటి వరకు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, సీపీఐ, జనతా పార్టీలు, ఇండిపెండెంట్‌గా పోటీచేస్తూ వచ్చినా 1982లో దివంగత ఎన్టీరామారావు తొలిసారి ప్రాంతీయ పార్టీ (తెలుగుదేశం)ను స్థాపించి 1983 ఎన్నికల్లో ఆ పార్టీ తరపున డాక్టర్ ఎంవీ రమణారెడ్డి పోటీ చేసి ఇండిపెండెంట్ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డిపై గెలుపొందారు. 1985 ఎన్నికల్లో ఎంవీ రమణారెడ్డి రాయలసీమ విమోచన సమితి పార్టీ నడుపుతూ స్వతంత్ర అభ్యర్థిగా నిలిచి టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి చేతిలో ఓడిపోయారు. తర్వాత కాంగ్రెస్ అభ్యర్థిగా వరదరాజులరెడ్డి వరుసగా 1989, 1994, 1999, 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు డాక్టర్ జి.వి.క్రిష్ణారెడ్డి, కొవ్వూరు రామసుబ్బారెడ్డి, మల్లెల లింగారెడ్డిపై విజయం సాధిస్తూ వచ్చారు. దాదాపు ఒకతరం పాటు పాతికేళ్ళు ఆయన హవా సాగింది.



ప్రొద్దుటూరు రైల్వే స్టేషన్



కాంగ్రెస్ హవాలో జిల్లాలో ఏకైక టీడీపీ ఎమ్మెల్యే లింగారెడ్డి


2009లో టీడీపీ అభ్యర్థి మల్లెల లింగారెడ్డి చేతిలో కాంగ్రెస్ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి మొదటి సారి ఓటమి చెందారు. అప్పట్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా, కాంగ్రెస్ రాష్ట్రంలో రెండో సారి అధికారంలోకి వచ్చింది. జిల్లాలో ప్రొద్దుటూరు మినహా అన్ని స్థానాలు కైవశం చేసుకున్నా జిల్లాలో ఏకైక టీడీపీ ఎమ్మెల్యేగా లింగారెడ్డి విజయదుందుభి మోగించారు.

2014, 2019లో గెలుపొందిన వైసీపీ

వైసీపీ ఏర్పడినప్పటి నుంచీ ప్రొద్దుటూరులో రెండుసార్లు ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి గెలుపొందారు. వైసీపీ 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పోటీ చేయగా టీడీపీ అభ్యర్థిగా నంద్యాల వరదరాజులరెడ్డి పోటీ చేసి శిష్యుడైన రాచమల్లు ప్రసాద్‌రెడ్డి చేతిలో రెండోసారి ఓటమిచెందాడు. ఆతరువాత జరిగిన 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా మల్లెల లింగారెడ్డి వైసీపీ అభ్యర్థి రాచమల్లు ప్రసాద్‌రెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు. మూడో సారి వైసీపీ హాట్రిక్ కోసం ముమ్మరయత్నాలు చేస్తోంది. ఈ పర్యాయం టీడీపీ అభ్యర్థిగా నంద్యాల వరదరాజులరెడ్డి బరిలో నిలవగా శిష్యుడైన రాచమల్లు ప్రసాద్‌రెడ్డి వైసీపీ అభ్యర్థిగా బరిలో వున్నాడు. పదేళ్ళ రాచమల్లు పాలనలో పట్టణంలో ఎంతో వ్యతిరేకతను కూడకట్టుకున్న రాచమల్లు హాట్రిక్ యత్నాలు ఫలిస్తాయా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఫలితంగా ఈ ఎన్నికలు ప్రొద్దుటూరులో ఉత్కంఠత రేకెత్తిస్తున్నాయి. ఒక వైపున వైసీపీ వైఫల్యాలు, మరో వైపున రాచమల్లుపై ప్రజావ్యతిరేకత టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డిని గెలిపిస్తుందా లేదా మే 13న ప్రొద్దుటూరు ఓటర్లు నిర్ణయించనున్నారు.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ బీసీలకు దక్కని టిక్కెట్లు

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అత్యధిక శాతం ఓటర్లు బీసీలున్నారు. ఆ తరువాత ఆర్యవైశ్య లు, ముస్లింలు. కేవలం 20 శాతం మాత్రమే రెడ్ల సామాజిక వర్గం. కానీ నియోజకవర్గం పుట్టినప్పటి నుంచీ వారిదే ఆధిపత్యం కొనసాగుతోంది. 2019 ఎన్నికల్లో ప్రొద్దుటూరు నుంచి బీసీలు టీడీపీ టిక్కెట్టు ఆశించారు. అందుకోసం పెద్ద ఎత్తున బీసీ సంఘాలు సభలు సమావేశాలు జరిపి గళం విప్పారు. బీసీల పార్టీఅయిన టీడీపీ సీటు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చంద్రబాబును కలిశారు. కానీ మళ్లీ సామాజిక వర్గాల కూర్పులో రెడ్లకే సీటు దక్కింది. 2024లో వైసీపీ సామాజిక బస్సు యాత్ర జరిపి బీసీలకు ప్రాధన్యత ఇస్తానని చెప్పడంతో ప్రొద్దుటూరు నుంచీ బీసీలైన న్యాయవాది చెన్నా సరళాదేవి వైసీపీ టిక్కెట్టు కోసం ప్రయత్నాలు చేసింది. ఆమేరకు పట్టణంలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి కరపత్రాలు పంపిణీ చేసి సమావేశాలు నిర్వహించారు. మరో వైపు బీసీలకు జనాభా దామాషా ప్రకారం టిక్కెట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాలు పెద్దఎత్తున సభలు జరిపారు. ప్రొద్దుటూరులో వైనాట్ బీసీ అని నినాదం తో డిమాండ్ వచ్చినా టీడీపీ వైసీపీ రెండు పార్టీలు కూడా మళ్ళీ రెడ్లకే ప్రాధన్యత నిచ్చాయి.



సం//	గెలుపొందిన అభ్యర్థి	పార్టీ	మొత్తం ఓట్లు	పొందిన ఓట్లు
1952	కె.బాల నారాయణరెడి	(కాంగ్రెస్)	68, 162	15,054
1955	కె.బాల నారాయణరెడ్డి	(కాంగ్రెస్)	64,618	23,563
1957	ఆర్ చంద్ర ఓబులరెడి	(ఇండి)	67,465	28,088
1962	పాణ్యం ఎర్రమునిరెడ్డి	(ఇండి)	77,924	30.695
1967	ఆర్ రామసుబ్బారెడ్డి	(కాంగ్రెస్)	72,924	27,354
1972	కొప్పరపు సుబ్బారావు	(కాంగ్రెస్)	93 289	30,502
1978	ఆర్ చంద్ర ఓబులరెడ్డి	(కాంగ్రెస్ ఐ)	1,10,010	34,160
1983	ఎంవీ రమణారెడ్డి	(టీడీపీ)	1,34,068	56,970
1985	ఎన్ వరదరాజులరెడ్డి	(టీడీపీ)	1,44,929	47,283
1989	ఎన్ వరదరాజులరెడ్డి	(కాంగ్రెస్)	1,73 ,661	77,386
1994	ఎన్ వరదరాజులరెడ్డి	(కాంగ్రెస్)	1,84,612	45,738
1999	ఎన్ వరదరాజులరెడ్డి	(కాంగ్రెస్)	1,96,850	46,740
2004	ఎన్ వరద రాజులరెడ్డి	(కాంగ్రెస్)	1,96,263	54,429
2009	మల్లెల లింగారెడ్డి	(టీడీపీ)	2,04,221	73,023
2014	ఆర్ శివప్రసాద్‌రెడ్డి	(వైసీపీ)	2,32,284	93,866
2019	ఆర్‌శివ ప్రసాద్ రెడ్డి	(వైసీపీ)	2,36,730	1,07,941

కామ్రేడ్‌లదే తొలివిజయం

- ఇప్పటి వరకూ హ్యాట్రిక్ విజయం నమోదు కాని వైనం
- మహా ఉద్దండులకు సైతం మూడోసారి ఓటమి
- ఈ సారీ అదే పరిస్థితి ?
- ఇదీ కమలాపురం నియోజకవర్గం తీరు



కడప (ఎస్సీ ఆర్ సర్కిల్), ఏప్రిల్ 18: కమలాపురం నియోజకవర్గానికి జిల్లాలో విశిష్ట స్థానం ఉంది. సీఎం జగన్ మేనమామ వరుసగా రెండుసార్లు ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఎందరో ఉద్ధండులను కమలాపురం శాసనసభ స్థానానికి ఎంపిక చేసిన ఓటర్లు మొట్టమొదటి విజయాన్ని భారత కమ్యూనిస్టు పార్టీకి అందించారు. 1952లో తొలిసారిగా కమలాపురం నియోజకవర్గానికి ఎన్నికలు జరిగితే.. అప్పట్లో సీపీఐ నుంచి పోటీ చేసిన నర్రెడ్డి శివరామిరెడ్డి గెలుపొందారు. ఈ నియోజకవర్గానికి మొట్టమొదటి ఎమ్మెల్యే ఆయనే. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి రామలింగారెడ్డిపై ఆయన విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థులు 7సార్లు, టీడీపీ అభ్యర్థులు 3 సార్లు, స్వతంత్ర అభ్యర్థులు రెండుసార్లు, వైసీపీ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారు. అయితే.. 1952లో కమలాపురం నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు వరుసగా మూడుసార్లు గెలుపొంది హ్యాట్రిక్ సాధించిన వారు ఎవరూ లేరు. 1985లో గెలుపొందిన మైసూరారెడ్డి 1989లోనూ విజయం సాధించారు. అయితే 1994లో ఓటమిపాలయ్యారు. వీరశివారెడ్డి కూడా ఈ నియోజకవర్గం నుంచి మూడుసార్లు గెలుపొందగా 1999లో ఓడిపోవడం వల్ల హ్యాట్రిక్ సాధించలేకపోయారు. ఇదే ఆనవాయితీ ఈ సారి కూడా కొనసాగుతుందని నియోజకవర్గంలో చర్చ నడుస్తోంది. ఇప్పటికే పి.రవీంద్రరెడ్డి రెండుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ దఫా ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో ప్రజలు టీడీపీ వైపు మొగ్గుచూపనుండడం, పుత్తా నరసింహారెడ్డిపై సానుభూతి ఉండడంతో రవీంద్రనాథరెడ్డి హ్యాట్రిక్ విజయానికి చెక్ పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

చోటా మోటా నేతల ఆనంద హేళ

పోరుమామిళ్ల, ఏప్రిల్ 18: ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల్లోని చోటా మోటా నేతలు, వీధి నాయకులకు ఎక్కువగా గిరాకీ ఏర్పడింది. పార్టీలు మారేటప్పుడు జనాలకు జెండాలు మోస్తే రూ.500, తోడు వస్తే రూ.200, కార్యక్రమాలకు హాజరైతే మరో 200, మద్యం అందిస్తూ జోరుగా తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు తంటాలు పడుతుంటారు. ఈ ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొనేటప్పుడు, పార్టీలు మారేటప్పుడు జన సమీకరణ కావాల్సి ఉండడంతో ముందుగానే నేతల వద్ద నుంచి డబ్బు పొందిన వారు కొందరు. అంతేకాక రాజకీయ పార్టీల నాయకులు ఆధిపత్యం ప్రదర్శించడం కోసం ఆయా ప్రాంతాల్లోని చోటా మోటా నేతలను దగ్గరకు తీసుకుంటూ తమ వర్గంలో చేర్చుకుంటూ తమ ఆధిపత్యం ప్రదర్శించాలని ఉవ్విళ్లూరుతూ అధినేతల వద్ద తమకు గుర్తింపు రావాలనే తలంపుతో ఖర్చుకు వెనుకాడడంలేదు. అనుకున్న తడవుగానే ప్రదర్శనలు చేయడం పరిపాటైంది. గ్రామాలకు వెళితే రూ.500, పట్టణాల్లో రూ.200, సాయంత్రం వరకు ఉంటే మరో రూ.200 మద్యానికి ఇవ్వడం వారి బలహీనతలను తమ బలప్రదర్శనకు వాడుకోవడం పరిపాటైంది. ఎవరైనా మందు పంచుతున్నారనే విషయం తెలుసుకుని ఆ ప్రదేశానికి వెళితే తమ వెంట వచ్చిన వారికే మందు ఇస్తామని, ఎవరంటే వారికి ఇవ్వమని చెప్పిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. ఈ ఎన్నికలు జరిగేంత వరకు పార్టీ కార్యక్రమాలు, బలప్రదర్శనలకు జనాలను చూపించేందుకు, ఆధిపత్యం ప్రదర్శించేందుకు ఈ రాజకీయ నేతలు విపరీతంగా ఖర్చు పెట్టేందుకు వెనుకాడడంలేదు. వచ్చిన అవకాశాన్ని ఎందుకు వదులుకోవాలి, ఊరికే రాజకీయ పార్టీల నాయకుల వద్దకు ఎందుకు వెళ్లాలి, వచ్చిన కాడికి డబ్బు, ఇచ్చిన కాడికి మందు చాలు అన్న రీతిలో నాయకుల వెంట వెళుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారు మరికొందరు. ఈ ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఎంత బలప్రదర్శన జరిగితే అంత ఉపయోగం అన్న రీతిలో ఉన్నారు మరికొందరు. ఎన్నికలు పూర్తయితే కనీసం మంచినీరు కూడా ఇవ్వరనే విషయం కూడా వారికి తెలియకపోలేదు. కానీ వచ్చిన అవకాశాన్ని ఎందుకు వదులుకోవాలని తమ ప్రాంతాల వారు పిలిచినప్పుడు ఎప్పుడు ఏ వ్యక్తితో ఏ అవసరం వస్తుందోనని భావించి వారి బాటలోనే పయనిస్తున్నారు మరికొందరు. ఈ వేడుకలు ఎన్నికలు జరిగే వరకు వీరి విన్యాసాలు, బలప్రదర్శనలు, ప్రగల్భాలు చూడాల్సిందే, వినాల్సిందే. ఎన్నికల సమయంలో యువతను ఎక్కువగా తమ వైపు తిప్పుకొనేందుకు కొందరు మద్యం, మనీ, మటన్, చికెన్ బిర్యానీలు, విందు వినోదాలు ఇచ్చిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి.

వృద్ధుల కోసం...

ఇంటి వద్దనే ఓటు హక్కు

85 ఏళ్లు దాటిన ఓటర్లు 7360 మంది

కడప(కలెక్టరేట్) ఏప్రిల్ 18: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ నాటికి 16 34644 మంది ఓటర్లున్నారు. అందులో అత్యధిక వయసు గల ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఎన్నికల కమిషన్ ఇంటివద్దనే ఓటు హక్కు వినియోగించుకునేలా మార్గ దర్శకాలు జారీ చేసింది. జిల్లాలో 85 ఏళ్ల వయసు దాటిన వృద్ధులు7360 మందిని బీఎల్వోలు గుర్తించారు. వారిలోఓ పురుషులు 2640, మహిళలు 4720 మంది ఉన్నారు. వారంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా బీఎల్వోలు ఇప్పటికే ఫారం-12-డి పూర్తిచేసి నివేదికలను సెక్టోరల్ అధికారులకు అంద జేశారు. ఎవరైనా వృద్ధులు తమ ఓటును పోలింగ్ కేంద్రానికి వెళ్ల లేని వారు వెంటనే బూత్ లెవల్ అధికారులను సంప్రదించాలి. ఈ అవకాశం కేవలం నాలుగు రోజులు మాత్రమే.

ప్రత్యేక చర్యలు అంటే ఇవేనా...?



ఆర్డీఓ కార్యాలయం వద్ద డీఎస్పీ యశ్వంత్ సహా కేంద్ర బలగాలు బందోబస్తు

జమ్మలమడుగు, ఏప్రిల్ 18: జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం నుంచి డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద కేంద్ర బలగాలతో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో డీఎస్పీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. నామినేషన్లకు వచ్చే అభ్యర్థులను తనిఖీ చేసి అభ్యర్థి సహా ఐదుగురికి అనుమతి ఇచ్చారు. ఇవన్నీ అటుంచితే జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా కూల్ డ్రింక్ షాపులు, దుకాణాలు ఉండడం వలన జనాలు గుంపులుగా చేరారు. మధ్యాహ్నం పాఠశాల విద్యార్థులు, వాహనాలు కూల్‌డ్రింక్ షాపుల వద్ద 30 నుంచి 40 మంది నిలబడి ఉండడం, పోలీసు అధికారులున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు. వంద మీటర్లకు దూరంలో వాహనాలను నిలపాలన్నది నిబంధన. ఐతే ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా జనాల రద్దీ ఉన్నా పోలీసు అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు వేసే ప్రాంతంలో ఒకే చోట ముగ్గురు నుంచి ఐదుగురు నిలబడకూడదనే నిబంధనలున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలేదని విమర్శలున్నాయి. విలేకరులకు కార్యాలయం ఆవరణలో సౌకర్యం కల్పించాల్సిన అధికారులు స్పందించలేదు. అంతేకాకుండా రోడ్డుపై ఉండకూడదని చెప్పడంతో ఎదురుగా ఆటోల్లో విలేకరులు కూర్చొని ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా లేదా ఆవరణలో వసతి కల్పించాలని కోరారు.



నామినేషన్ కార్యాలయం వద్ద గుంపులుగా జనాలు, పోలీసుల వాహనాలు

వైసీపీకి డాక్టర్ సునీత భయం

- సోదరి షర్మిల గెలుపు కోసం అహర్నిశలు కృషి
- తండ్రి వైఎస్ వివేకానందరెడ్డిని తలపిస్తున్న వైనం

(కడప - ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్ సునీతారెడ్డి.. ఇప్పుడు ఈ పేరు వింటేనే వైసీపీ శిబిరం జడుసుకుంటోంది. ప్రత్యక్ష రాజకీయాలు అలవాటు లేని సునీత ఇప్పుడు కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేస్తున్న సోదరి వైఎస్ షర్మిల గెలుపుకోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండడం వైసీపీని కలవరపాటుకు గురిచేస్తోంది. సునీత ఇటీవల వేస్తున్న పొలిటికల్ అడుగులు చూస్తే తన తండ్రి దివంగత వివేకానందరెడ్డి రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని నిశ్శబ్దంగా తన పని తాను చేసుకు వెళుతున్నారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

షర్మిలాను ఎంపీ చేయడమే లక్ష్యం

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని 2019 మార్చి 15న ఆయన ఇంట్లో గొడ్డలితో నరికి దారుణంగా చంపారు. అప్పట్లో ఈ హత్యను వైసీపీ నేతలు టీడీపీ పైకి నెట్టి ఎన్నికల్లో బాగా లబ్దిపొందారు. అయితే సీబీఐ విచారణతో వివేకా హత్య నిందితులెవరో తేటతెల్లమైంది. ఎంపీ అవినాశ్



పులివెందుల పూలంగళ్ల వద్ద వినాయకుని గుడిలో ప్రచారానికి ముందు ప్రత్యేక పూజలు చేస్తున్న డాక్టర్ సునీత

రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని సీబీఐ నిందితులుగా చేర్చింది. దీంతో ఒక్కసారి జగన్ కుటుంబం చీలిపోయింది. వివేకా హంతకులకు శిక్ష పడాలని సునీత చేస్తున్న పోరాటానికి షర్మిల మద్దతు ఇచ్చారు. వివేకా చివరి కోరిక తనను ఎంపీ చేయాలన్నదే అని షర్మిల ప్రకటించారు. అది నెరవేర్చడం, వివేకా హత్య కేసులో నిందితుడు పార్లమెంటుకు వెళ్లకుండా ఉండేందుకు పోటీ చేస్తున్నట్లు షర్మిల, సునీత ప్రకటించారు. ఇప్పటికే షర్మిల బస్సు యాత్ర జిల్లాలో సక్సెస్ అయింది. బస్సు యాత్రలో డాక్టర్ సునీత సైతం పాల్గొన్నారు. వివేకా హత్య కేసులో నిందితులకు ఓటు వేయవద్దంటూ బహిరంగంగా విజ్ఞప్తి చేశారు. వివేకా సన్నిహితులను 15 రోజులుగా సునీత కలుస్తూ వస్తున్నారు. పులివెందుల, వేంపల్లె, కడప.. ఇలా వివేకా అనుచరులుగా ఉన్న వారందరినీ కలిసి వివేకా చివరి కోరిక మేరకు షర్మిలాను ఎంపీగా గెలిపించాలని కోరుతూ.. వ్యూహాత్మకంగా అందరి మద్దతు కూడగడుతూ వస్తున్నారు. అలాగే పులివెందులలో తిరుగుతూ వివేకాను చంపిన హంతకులకు ఓటు వేయవద్దంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. గురువారం షర్మిలా గెలుపు కోసం ప్రచారానికి సునీత శ్రీకారం చుట్టారు. పులివెందుల పూలంగళ్ల వద్ద వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం చేపట్టారు. చాపకింద నీరులా సునీత తన తండ్రి వివేకాను తలపించేలా ముందుకు వెళుతుండటం వైసీపీ నేతలను కలవరపాటుకు గురిచేస్తోంది.

ఆధారాలున్నాయా...

జాగ్రత్త పడకుంటే నగదు సీజ్

అత్యవసరమైతే ఆన్‌లైన్‌లో నగదు బదిలీ బెటర్

పులివెందుల రూరల్, ఏప్రిల్ 18: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) బృందాలు, పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అంతేకాకుండా ప్రజల వద్ద ఉన్న బ్యాగులు, ఇతర వస్తువులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ తనిఖీల్లో నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులకు సంబంధించి ఆధారాలు చూపకపోతే సీజ్ చేస్తున్నారు. బిల్లులు, రసీదులు ఇలా ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి తీసుకెళ్తే స్వాధీనం చేసుకుంటారు. ఈ ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రజలు జాగ్రత్తలు పడాల్సిందే. అత్యవసరమై తే ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేసుకోవడం మేలు.

- చదువుల కోసం ఫీజులు చెల్లించాల్సిన సమయంలో నగదు తీసుకెళ్లే సమయంలో పాఠశాల, కళాశాల ఫీజు కట్టాలనే నోటీసు వెంట ఉంచుకోవాలి. లేదా సంబంధిత యాజమాన్యాల రసీదులు ఉంచుకోవాలి.
- బ్యాంకు లావాదేవీలు రూ.50వేలకు మించితే ఆధారాలు చూపించాలి. చెక్కు ద్వారా నగదు విత్‌డ్రా చేస్తే చెక్కు జిరాక్స్, పాస్‌బుక్ దగ్గర ఉంచుకోవాలి. ఏటీఎం ద్వారా నగదు విత్‌డ్రా చేస్తే ఏటీఎం స్లిప్‌లు ఉంచుకోవాలి. ఒకవేళ నగదును డిపాజిట్ చేసేందుకు వెళ్తుంటే అందుకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంచుకోవాలి.
- ఫైనాన్స్ సంస్థలు, చిట్టీలు రోజు భారీగా లావాదేవీలు జరుగుతాయి. కలెక్షన్ల ఏజెంట్ల వద్ద లక్షల్లో నగదు ఉంటుంది. వీరు ఆరోజు చేసిన కలెక్షన్ వివరాలు, బాకీ ఉన్న నగదు, వసూలైన నగదు ఇలా అన్ని వివరాలతో పాటు కస్టమర్ల సంతకంతో కూడిన రసీదులు ఉండాలి.
- బంగారు, ఇతర వస్తువులు కొనుగోలుకు నగదు తీసుకెళ్లే ప్రజలు శుభకార్యాలకు సంబంధించి శుభలేఖలు దగ్గర ఉంచుకోవాలి. తనిఖీ బృందం అడిగితే వివరాలు అందించాలి.
- అత్యవసర సమయాల్లో ఎక్కువ డబ్బు ఆస్పత్రుల్లో బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి సమయంలో పేషంట్ మెడికల్ కేస్ షీట్, మెడికల్ సర్టిఫికెట్, ఆస్పత్రి బిల్లులు అందుబాటులో ఉంచుకోవాలి.



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

పులివెందులలోనూ బలవంతమే..!

- రెండు రోజులుగా వలంటీర్లతో రాజీనామాలు

కడప, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోనూ వార్డు వలంటీర్ల బలవంతపు రాజీనామాలు సాగుతున్నాయి. సాక్షాత్తు ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే వలంటీర్లతో బలవంతపు రాజీనామాలు సాగించడం చర్చనీయాంశమైంది. అనేక జిల్లాల్లో వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం అది ఎన్నికల కమిషన్ దృష్టికి వెళ్లి కేసులు నమోదు చేయడం జరుగుతోంది. దీంతో వలంటీర్లను రాజీనామా చేయాలని ఆయా ప్రాంత వైసీపీ నేతలు ఒత్తిడి తెస్తున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో కూడా ఇదే పరంపర కొనసాగడం హాస్యాస్పదంగా ఉంది. రెండు రోజులుగా వలంటీర్లను రాజీనామా చేయాలని పులివెందుల నేతలు ఒత్తిడి తెస్తున్నారు. బుధవారం సుమారు 130 మంది వలంటీర్లతో రాజీనామా చేయించారు. అలాగే గురువారం కూడా 70 నుంచి 90 మందితో రాజీనామా చేయించినట్లు తెలిసింది. రాజీనామా చేస్తున్న వారికి రూ.5వేల నుంచి రూ.10వేలు నగదు అందించినట్లు తెలిసింది. ఐదేళ్లుగా వాడుకుని ఉన్నట్లుండి రాజీనామాలు చేయమనడం బాగోలేదని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని పులివెందులకు చెందిన ఓ అధికారిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా రాజీనామాలు చేయడం వాస్తవమే అన్నారు. కొందరు నేతలు ఒత్తిడి తేవడంతో రాజీనామాలు చేశారని అన్నారు.

టీడీపీలో చేరికల వరద



ఓబులవారిపల్లె: జనసేన, టీడీపీల్లో చేరుతున్న కార్యకర్తలు



రాజంపేట: టీడీపీలో చేరుతున్న ఎంఎల్ నారాయణ, నరసయ్య

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 18 : మండలంలోని మంగంపేట బలిజపల్లిలో గురువారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ సమక్షంలో, బీజేపీ నేతలు గల్లా శ్రీనివాసులు, పులపత్తూరు రామసుబ్బారెడ్డి, టీడీపీ నేతలు అనుమలగుండం చంద్రమోహన్, కల్లాచలపతి, మాజీ వైస్ ఎంపీపీ గునిపాటి రాయుడు, గునిపాటి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అరిగెల గోవిందు, కొటూరు మణి, రమణ, తిరుమలశెట్టి శీను, గునిపాటి శివతోపాటు 150 మంది టీడీపీలో చేరగా, మంగారపు నరసింహులు, నారదాసు కిష్టయ్య, కందుకూరి మణితోపాటు 50 మంది జనసేనలో చేరారు. ఈ సందర్భంగా జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల జనసేన సైనికుల శ్రమకు త్వరలో ఫలితం రాబోతోందని, రైల్వేకోడూరులో మన తడాఖా ఏమిటో వైసీపీకి చూపించాలని కోరారు. బీజేపీ నేతలు పులపత్తూరు రామసుబ్బారెడ్డి, గల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించి మన పారిశ్రామిక సమస్యలకు పరిష్కారం కోరుదామని తెలిపారు. వాసుదేవరెడ్డి, అడపాల బాలాజీ, మంగంపేట యూత్ నాయకులు అనుమలగుండం హరికృష్ణ, బీజేపీ నాయకులు రామసుబ్బా రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జై భారతరెడ్డి, జనసేన నాయకులు ముత్యాల కిషోర్ తదితరులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజంపేట: మండలంలోని ఊటుకూరు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, నర్సయ్య గురువారం రాజంపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాజంపేట మండల మాజీ ఉపాధ్యక్షుడు నాగా సుధాకర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కొండయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి

గాలివీడు, ఏప్రిల్18: రాష్ట్రంలో అరాచక పాలన అందిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి న్నారు. ఆయన గురువాజు బోరెడ్డిగారిపల్లె పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మహమ్మద్‌రఫీతో పాటు 30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి.

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని పందిళ్లపల్లె, సోములవాండ పల్లె, జె వడ్డెపల్లె, తాటిమాకులపల్లె, బుర్జుపల్లె, శ్రీరాం పురం, రాచపల్లె, కోతలగుట్టపల్లెల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కస్తూరిరాజుగారిపల్లెలో పాపన్న, సిద్దక వెంకటరామిరెడ్డి, దేవనాథరెడ్డి, జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో 50కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



శివశంకర్‌రాజు మృతదేహం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 18: అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వేకోడూరు పట్టణంలోని ఉంగరాలనగర్‌కు చెందిన చమర్తి శివశంకర్‌రాజు (62) గురువారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రేణిగుంట రైల్వే పోలీసు హెడ్‌కానిస్టేబుల్ గౌరీశంకర్ తెలిపారు. అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. మృతదేహాన్ని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

కొండగొర్రెను కాపాడిన ఫారెస్ట్ సిబ్బంది



కొండ గొర్రెతో అటవీ శాఖ అధికారులు

సిద్దవటం, ఏప్రిల్ 18 : కొండగొర్రె గ్రామంలోకి వచ్చిందని గురువారం సిద్దవటం మండలం జంగాలపల్లె వాసులు సమాచారం అందించడంతో సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకొని వన్యప్రాణిని సురక్షితంగా అటవీ ప్రాంతంలోకి తరలించినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి శ్రమించండి : ముక్కా



సమావేశంలో మాట్లాడుతున్న ముక్కా రూపానందరెడ్డి

పుల్లంపేట, ఏప్రిల్18 : పుల్లంపేట మండలంలోతెలుగుదేశం పార్టీ తరఫున రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని రైల్వేకోడూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పుల్లంపేటలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేస్తే అత్యధిక మెజారిటీ సాధించవచ్చునన్నారు. ప్రచార కమిటీలు ఏ విధంగా పనిచేయాలన్న విషయాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామస్థాయి నాయకులంతా 20 రోజుల పాటు కష్టపడి పనిచేస్తే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చూడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ నేలపాటి రామచంద్రయ్య నాయుడు, పుల్లంపేట మండల అధ్యక్షుడు ఆరే సుధాకర్‌నాయుడు, ఉపాధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి పోలి జగదీశ్వర్‌రెడ్డి, మాజీ మండలాధ్యక్షులు కేశినేని నారాయణ నాయుడు, లింగుట్ల వెంకటరమణ, దేవరకొండ నరసింహ, సీనియర్ నాయకులు మువ్వినేని విజయ్‌కుమార్ చౌదరి, వెంకటసుబ్బయ్య యాదవ్, యూనిట్ ఇన్‌చార్జి చుండు ఈశ్వరయ్య నాయుడు, ముద్ద గంగిరెడ్డి, ఆకేపాటి సుధాకర్‌రెడ్డి, కర్లం రాజానాయుడు, బాసినేని మనోహర్, కాకర్ల ప్రభాకర్, మురళిరెడ్డి, నరసాపురం శివాజీ, చిన్నం శివయ్య, ఎస్సీ నాయకులు గంగాధర్, కొండంపల్లె మల్లి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థులను ఆశీర్వదించండి

చిట్వేలి: ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి ఆశీర్వదించండి అని ముక్కా రూపానందరెడ్డి సతీమని ముక్కా వరలక్ష్మి కోరారు. గురువారం మండల పరిధిలోని కేవీఆర్‌పురంలో ముక్కా శిరీష కూటమి నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్లాస్, కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న అవస్థలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెంచయ్య యాదవ్, పద్మావతమ్మ, కోటి, జనసేన నాయకులు మాదాసు నరసింహ, సుధీర్‌రెడ్డి, తేజ, రాజా, పెంచలయ్య, గుండయ్య నాయుడు, నరేష్, సుబ్బరాయుడు, వెంకటేష్, జయమ్మ, వెంకటసుబ్బయ్య, వెంకటయ్య, వెంకటరమణ, శ్రీను, సుబ్రమణ్యం, కృష్ణయ్య, వెంకటయ్య, మణి, మహేష్, నాగేష్, ఈశ్వరయ్య, గంగయ్య, చెన్నయ్య, సుబ్బయ్య, కొత్తూరు ఈశ్వరయ్య, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోరలు చాచిన డెంగ్యూ..!

● ప్రైవేటు ఆస్పత్రులకు రోగుల పరుగులు ● గ్రామాల్లో కొరవడిన పర్యవేక్షణ ● ఆస్పత్రుల్లోనే వైద్య సిబ్బంది







డెంగ్యూ పాజిటివ్ రిపోర్ట్, చికిత్స పొందుతున్న బాలుడు

సంబేపల్లె, ఏప్రిల్ 18: ప్రస్తుత వేసవిలో ప్రజలను డెంగ్యూ వ్యాప్తి భయపెడుతోంది. సంబేపల్లె మండల పరిధిలోని దుద్యాల, చిన్నకోడివాండ్లపల్లె, పెద్దజంగంపల్లెలో పలువురు డెంగ్యూ బారిన పడి రాయచోటిలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చు చేసి చికిత్స తీసుకుంటున్నారు. అయినా వైద్యులు అటువైపు చూడడం లేదు. గ్రామాల్లో స్థితిగతులను పర్యవేక్షించాల్సిన సూపర్‌వైజర్లు ఆరోగ్య కేంద్రం వదిలి బయటకు వెళ్లడం లేదు. సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నలుగురు సూపర్‌వైజర్లు ఉన్నారు. ఒక్కో సూపర్‌వైజర్ ఒక్కో గ్రామంలో పర్యవేక్షించి జ్వరాలపై వైద్యసేవలపై ముందస్తు చర్యలు తీసుకోవాలి. అయితే నలుగురూ ఒకే చోటకు వెళుతున్నారని అంటున్నారు. నామమాత్రంగా ఏడాదికి ఒకటి, రెండు సార్లు ప్రభుత్వ కార్యక్రమాలు ఉన్నప్పుడే వారు గ్రామాల్లో కనిపిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో మురుగునీరు కలుషితమై దోమలు పెరిగే అవకాశం ఉంది. దోమలు కుట్టడం వల్ల వైరల్ జ్వరాలు వస్తాయి. గత నెల రోజుల ముందు కొత్రాళ్ల హరిజనవాడ, ఊరగాయ గుట్ట హరిజనవాడలో పలువురు డెంగ్యూ బారిన పడి రాయచోటి, తిరుపతి, బెంగుళూరు వంటి ప్రైవేటు ఆసుపత్రిలో వేలకు వేల రూపాయలు ఖర్చు చేసి చికిత్స పొంది ఇళ్లకు వచ్చినట్లు సమాచారం. బయటపడని డెంగ్యూ కేసులు గ్రామాల్లో ఎక్కువ ఉన్నాయని విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై సంబేపల్లి వైద్యాధికారిని వివరణ కోరగా డెంగ్యూ జ్వరాలు ఉన్న మాట వాస్తవమేనన్నారు. గృహావసరాలకు వాడుకునే నీటిలో లార్వా పెరుగుతోంది. అలాంటి నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు, వేసవి కావడంతో నీటి కొరత కారణంగా సమస్యసలు ఎదుర్కొంటున్నామన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



రాయచోటి ఏరియా ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు



లక్కిరెడ్డిపల్లె: గ్యాస్‌గోడౌన్‌వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాయచోటిటౌన్, ఏప్రిల్ 18: వైద్యులతో పాటు ఆసుపత్రి సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరమని రాయచోటి అగ్నిమాపకశాఖ అధికారి వెంకట్రామిరెడ్డి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం 5వ రోజు రాయచోటి ఏరియా ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డెమో ద్వారా వివరించారు. మంటలను ఎలా అదుపు చేయాలి, ప్రమాదం నుంచి రోగులకు ఎలా కాపాడాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఆసుపత్రి సిబ్బంది అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండటమే కాకుండా, చుట్టుప్రక్కల వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే 08561 251099 (101), 9963737253 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి అగ్నిమాపక సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : గ్యాస్ గోడౌన్ అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం అక్కిరెడ్డిపల్లెలోని గ్యాస్‌గోడౌన్ వద్ద విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ గోడౌన్ చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లోడు దించేటప్పుడు సిలిండర్ లీక్ కాకుండా జాగ్రతగా దింపాలన్నారు. కస్టమర్లకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారులకు కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ గ్యాస్ ఏజెన్సీ సరోజారెడ్డి, మనోహర్ రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీకి అండగా నిలుద్దాం.. వర్గీకరణ సాధించుకుందాం..

● ఎంఆర్‌పీఎస్ నేత రామాంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులుమాదిగ

రాయచోటిటౌన్, ఏప్రిల్18: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్న తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచి ఎస్సీ వర్గీకరణ సాధించుకుందామని ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులుమాదిగ పిలుపునిచ్చారు. గురువారం రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద ఎంఆర్‌పీఎస్ రాజకీయ నిర్ణయ కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల ఎంఆర్‌పీఎస్ కోర్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఎస్సీల్లోని 59 ఉపకులాలకు సమన్యాయం చేస్తానని హామీ ఇచ్చిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మాట గౌరవించి మాదిగల ఓట్లు తెలుగుదేశం పార్టీకి వేసి గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులకు ఉన్న 27 పథకాలను రద్దు చేసి అభివృద్ధికి అడ్డుగా మారిందన్నారు. పేరుకే మూడు ఎస్సీ కార్పొరేషన్లు పెట్టి ఒక్కపైసా నిధులు కేటాయించకుండా మోసం చేసిందన్నారు. సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించి అన్యాయం చేసిందన్నారు. అంతేగాక ఎటువంటి లోన్లు లేకుండా స్వయం ఉపాధికి దూరం చేసిందన్నారు. దళితుల పట్ల చిన్నచూపుతో దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు చేసి అరాచకాలు సృష్టించి ఎందరో దళితుల ప్రాణాలను బలి కొన్నారన్నారు. మాస్కులు అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్ చావుకు కారకులైనారని, అనంతరం జిల్లాలో ఒక దళిత మహిళను ప్రేమ పేరుతో మోసం చేసి హత్య చేసిన వ్యక్తిని కాపాడారన్నారు. వెటర్నరీ డాక్టర్ అచ్చన్నను అదే డిపార్టుమెంట్ వాళ్లు హత్య చేస్తే హంతకులకు అండగా నిలిచారన్నారు. ఇసుక మాఫియా గురించి మాట్లాడినందుకు ఒక దళితునికి గుండు కొట్టించి అవమానించి వారి కుటుంబానికి అన్యాయం చేశారన్నారు. సుబ్రమణ్యం హత్య కేసు నిందితుడిని ఊరేగించడమే కాక ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టి మాదిగల ఆత్మగౌరవాన్ని కించపరిచిన జగన్ మోహన్‌రెడ్డిపై మాదిగల ఆగ్రహంతో ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నామన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి మాకు అవసరం లేదంటూ ప్రజలు కోరుకుంటున్నారని, ప్రజా రంజక పాలనందించే పాలన కోసం టీడీపీకి ఓటేసి విజన్ ఉన్న చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు ఆంజనేయులు, సాంబశివ, చిన్నప్ప, దిబ్బల ఆంజనేయులు, నరసింహులు, దర్బార్‌తో పాటు ముఖ్య నాయకులు వెంకట్రమణ, వందాడి రమణ, రాంబాబు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి విజయానికి సైనికుల్లా పనిచేయాలి

● బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు



కార్యకర్తల సమావేశంలో నాగోతు రమేశ్‌నాయుడు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 18: బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థుల విజయానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు పిలుపునిచ్చారు. గురువారం రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులోని ఓ రెస్టారెంట్‌లో రాయచోటి నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గ ం నుంచి టీడీపీ అభ్యర్థిగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పోటీలో ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి వారి విజయానికి కృషి చేయాలన్నారు. పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో పాటు, ప్రస్తుత మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమణ, కోకన్వీనర్ నిర్మల్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాసకుమార్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందగజపతిరాజు, బీజేపీ సీనియర్ నాయకులు శివగంగిరెడ్డి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మానికి నిలువెత్తు నిదర్శనం శ్రీరాముడు



ప్రసంగిస్తున్న గంగనపల్లి వెంకటరమణ

రాజంపేట టౌన్, ఏప్రిల్ 18 : ధర్మబద్ధమైన మానవ జీవితానికి నిలువెత్తు నిదర్శనం శ్రీరాముడని, అన్ని కాలాల్లో ఆయన ఆదర్శప్రాయుడని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ తెలిపారు. రాజంపేట పట్టణం ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన రామాయణ సప్తాహం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దుష్టశిక్షణ.. శిష్ట రక్షణ కోసం సాక్షాత్తు శ్రీ మహావిష్ణువే శ్రీరాముడి రూపంలో మానవుడిగా అవతరించి ఎన్నో కష్టాలు అనుభవించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేదపండితులు యతిరాజం, హరినాథశర్మ, రవికుమార్‌శర్మ, భగవద్గీత సేవా సత్సంగం అధ్యక్షుడు బొమ్మవరం మునీశ్వర్‌రెడ్డి, తుంగా వెంకటరమణారెడ్డి, నాగా వేణుగోపాల్‌రెడ్డి, రామచంద్రనాయుడు, చీనేపల్లి చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించి రైతులను ఆదుకోవాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్18: అన్నమయ్య జిల్లాలో రైతన్న కరువు కాటుతో అల్లాడుతున్న పట్టించుకునే నాథుడే లేడా అని ఏపీ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి అన్నారు. గురువారం ఆయన ఏపీ రైతు సంఘం నాయకులు వెంకటసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని 30 మండలాల రైతులు తీవ్ర కరువు పరిస్థితులు ఎదుర్కొంటుండగా, ప్రభుత్వం 18 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. ఆ మండలాల్లోని రైతులకు కూడా ఇంతవరకు ఎలాంటి మేలు జరగలేదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, నష్టపరిహారం చెల్లిస్తున్నామంటూ ముఖ్యమంత్రి జగన్ రెండు సార్లు బటన్ నొక్కినా రైతులకు న్యాయం జరగలేదన్నారు. ఉత్తుత్తి బటన్‌లు నొక్కి రైతులలను మోసం చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వెంటనే అన్నమయ్య జిల్లాలోని కరువు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం చెల్లించాలనిడిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ప్రోత్సహించండి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 18: విద్యలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ప్రోత్సహించాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి సూచించారు. గురువారం రాయచోటి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కృత్యాలపై ఒక్కరోజు ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సమ్మిళిత విద్య ద్వారా పొందే లాభాలపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. మన రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతులు డిజిటల్ విద్య ద్వారా పదవ తరగతి పరీక్షల్లో కూడా ప్రావీణ్యం కనబరుస్తున్నారని చెప్పారు. ప్రతి మండలంలో ఉన్న భవిత కేంద్రాలు, ఐఈఆర్పీలు, హైస్కూల్స్‌లో ఉన్న ప్రత్యేక స్కూల్ అసిస్టెంట్లు అందరికీ విద్య కార్యక్రమంలో సీడబ్ల్యూఎస్ఎన్‌కు కావాల్సిన సదుపాయాలను కల్పించాలన్నారు. అర్హులకు అలవెన్సులు అందేవిధంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమ్మిళిత విద్య సెక్టోరియల్ ఆఫీసర్ జనార్దన్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణల్లో పాల్గొని సమస్యలు తెచ్చుకోవద్దు



పుల్లంపేట పోలింగ్‌బూత్ వద్ద ప్రజలకు సూచనలిస్తున్న ఎస్ఐ రఘురాం

పుల్లంపేట, ఏప్రిల్18 : రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఘర్షణలకు వెళ్లి కేసుల్లో ఇరుక్కోవద్దని పుల్లంపేట ఎస్ఐ రఘురాం హెచ్చరించారు. గురువారం రాత్రి ఆయన పుల్లంపేటలోని పోలింగ్ బూత్ వద్ద ప్రజలకు ఎన్నికల గొడవలపై అవగాహన కల్పించారు. మద్యం, డబ్బు పంపిణీలో ఎవరూ పాల్గొనవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రాజకీయ నాయకుల మాట విని మోసపోయి తప్పులకు పాల్పడవద్దని సూచించారు. ఎన్నికలు జరిగేటప్పుడు ఎవరి ఓటు వారే వేసుకోవాలని, దొంగ ఓట్లకు పాల్పడితే కేసులు పెడతామని హెచ్చరించారు.

లింగంపల్లెలో టీడీపీ ఇంటింటి ప్రచారం



లింగంపల్లె గ్రామంలో ఇటీవల ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు జానకిరామ్

సిద్దవటం, ఏప్రిల్ 18: సిద్దవటం మండలంలోని లింగంపల్లెలో గురువారం తెలుగుదేశం పార్టీ రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాల సుబ్రమణ్యం సోదరుడు సుగవాసి జానకిరామ్ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి సుబ్రమణ్యంను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి వేయించి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి దశరథ రామనాయుడు, రాజంపేట పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబును కలసిన పంతగాని



చంద్రబాబుతో పంతగాని నరసింహప్రసాద్

రైల్వేకోడూరు, ఏప్రిల్ 18: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును గురువారం విజయవాడలో టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ కలిసారు. రైల్వే కోడూరు కూటమి అభ్యర్థిని గెలిపించే బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించినట్లు తెలిపారు. పార్టీ కష్ట కాలంలో ఆటలు, పాటలతో ప్రజల్ని చైతన్యవంతులు చేసినందుకు అభినందించారన్నారు. కరోనా సమయంలో చేసిన సేవలు గురించి కూడా చర్చకు వచ్చాయన్నారు. అందరూ కలసి, మెలసి పని చేయాలని సూచించారని తెలిపారు.

ఇస్తారా.. చస్తారా!



'పిల్చుకొచ్చేటపుడు ఒక మాట. కూలి డబ్బులిచ్చేటప్పుడు ఇంకొక మాట. ఇదేమి న్యాయం?' అంటూ నిలదీస్తున్న ఆ ఆడవాళ్లను చూసి ఏం జరిగిపోతోందా అని ఆసక్తితో కుప్పం నడి బజారులో గురువారం అందరూ పోగయ్యారు. ఫ్లాష్ బ్యాక్ ఏందంటే.. బుదారంనాడు బులుగు పార్టీవోల్లు కుప్పంలో ర్యాలీ పెట్టుకున్నారు. జనం గనంగా ఉండాలనే రొండు నూర్ల మందిని కూడేసినారు. పార్టీ జెండాలు చేతికిచ్చి జేజేలు పలికిస్తూ ఊరంతా తిప్పించినారు. ఎర్రటి ఎండలో తిరిగీ తిరిగీ ఆ పార్టీ లీడరు ఇంటికి చేరుకునేసరికి సాయంత్రమైపాయె. దుడ్లు ఇస్తే వెళ్లిపోదామని బయట నిలబడ్డారు. లేటయిపోతా ఉండడంతో ఇళ్లలో పనీ పాటా ఉంటుంది గదా.. మా దుడ్లు గూడా మీరే తెచ్చేయ్యండి అని చెప్పి కొందరు ఇళ్లకి వెళ్లిపోయారు. ఆ తర్వాత దుడ్లు తెచ్చి పంచే పని మొదులు పెట్టినారు. తలా ఐదొందలు చేతల్లో పెట్టినారు. అయితే ఉండేవాళ్లకే దుడ్లు అని చెప్పడంతో ఎర్రటి ఎండనబడి తిరిగిన ఆడోళ్ల కడుపులు కాలిపాయ. నోళ్లు తెరిచినారు. దాంతో దిగొచ్చి పిల్చుకొచ్చిన వాళ్లందరికీ దుడ్లు లెక్కగట్టి ఇచ్చినారు.

- కుప్పం

ఆ ఇద్దరూ కలిసేకి అయ్యేదేనా!



బెదిరించో, బుజ్జగించో మనుషుల్ని కలవచ్చుకానీ, మనసుల్ని కలపగలరా? గురువారం పలమనేరు వైసీపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, నామినేషన్ వేసిన ఎమ్మెల్యే వెంకటేగౌడల తీరు చూస్తే మాత్రం మనసులు కలిపేది అయ్యేకేనా అనిపించింది. వి.కోట మండలానికే చెందిన ఈ ఇద్దరూ ఒకే సామాజికవర్గం కూడా. ఒకే పార్టీలో రెండు కత్తుల్లా కొనసాగుతూనే ఉన్నారు. ప్రొటోకాల్ రగడలు తారస్థాయికి చేరడంతో పెద్దిరెడ్డి మధ్యస్తం తప్పలేదు. ఈసారి టికెట్ తనకు ఇవ్వచ్చు కదా అని శ్రీనివాసులు ఆశపడ్డా అధిష్ఠానం వెంకటేగౌడకే ఇచ్చింది. పార్టీ పెద్దల హెచ్చరికలతో ఇద్దరూ కొంతకాలంగా ఒకే వేదికల మీద కనిపిస్తున్నా ఎడమొహం పెడమొహంగానే ఉంటున్నారు. గురువారం పలమనేరులో నామినేషన్ దాఖలుకు వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలోనూ ఈ ఇద్దరూ ఇలాగే కనిపించారు. దీంతో కష్టమేనప్పా ఇద్దరినీ కలిపేది అని పార్టీవారే చెవులు కొరుక్కున్నారు.

- వి.కోట

ఇదీ ముందు

సర్పంచులు.. ఒకప్పట్లో వెలిగారు. ప్రజలకు చేరువలో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూ, అభివృద్ధి పనులు చేస్తూ, మౌలిక వసతులు కల్పిస్తూ గుర్తింపు పొందారు. అలాంటి సర్పంచులను జగన్ ప్రభుత్వం డమ్మీలుగా మార్చేసింది. నిధులు, విధులు, అధికారాలు లేకుండా చేసింది. ఈ పరిణామం పట్ల అధికార పార్టీ గ్రామ ప్రజాప్రతినిధులూ అసహనంతో ఉన్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



పంచాయతీ ఖాతాల్లో నిధులు మళ్లించిన ప్రభుత్వంపై కేసు పెట్టాలంటూ ధర్నా చేస్తున్న సర్పంచులు (ఫైల్ ఫొటో)

డమ్మీ సర్పంచులు!

స్థానిక సంస్థల్ని నిర్వీర్యం చేసిన జగన్

పంచాయతీల ఖాతాల్లో నిధులు జీరో

ఉమ్మడి జిల్లాలో రూ.195 కోట్ల మళ్లింపు

చిన్న సమస్యనూ పరిష్కరించలేని స్థితిలో గ్రామపాలకులు



మోసం గురూ!

ఉమ్మడి జిల్లాలోని 1411 గ్రామ పంచాయతీలకు కేంద్రం 14, 15వ ఆర్థిక సంఘం నిధుల్ని విడతల వారీగా రూ.195 కోట్లను జమ చేసింది. జమ చేసిన వెంటనే ఆయా నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం మళ్లించేసింది. చాలా మంది సర్పంచులు గౌరవం కోసం అప్పులు చేసి మరీ స్థానిక సమస్యల్ని పరిష్కరించారు. ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో చేసిన పనులకు బిల్లులు రావడం లేదు. దీంతో అప్పులకు వడ్డీలు కట్టుకోలేక సర్పంచులు అల్లాడుతున్నారు. ఇక అప్పు చేసే స్తోమతలేని సర్పంచులు సమస్యల్ని అలాగే వదిలేశారు. చిన్నపాటి సమస్యలనూ పరిష్కరించలేక, ప్రజలకు కనిపించకుండా తిరుగుతున్నారు. తమ నిధుల్ని మళ్లీ పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని సర్పంచులు ఎన్నో ఉద్యమాలు చేశారు. నిధుల్ని దొంగిలించిన సీఎం జగన్ మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ గతేడాది జూలైలో చిత్తూరులో ధర్నా చేసి, పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినా, ప్రభుత్వం నుంచి చలనం లేదు. దీనికితోడు వలంటీరు, సచివాలయ వ్యవస్థతో సర్పంచుల్ని పట్టించుకునేవారు లేకుండా పోయారు. ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికలో వీరి ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఈ పరిణామాల పట్ల జగన్ ప్రభుత్వంపై సర్పంచులు ఆగ్రహంతో ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం అధికార పార్టీకి చెందిన సర్పంచులే ఉన్నారు.

బంగారుపాళ్యం మండలంలోని 170 గొల్లపల్లె పంచాయతీకి మూడేళ్లలో రూ.39 లక్షల ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. ఈ నిధుల్లో నయా పైసా పంచాయతీ అవసరాలకు ఇవ్వకుండా మొత్తం రాష్ట్ర ప్రభుత్వం మళ్లించేసింది. బోర్లు, పైపు లైన్లు, డ్రైనేజీ తదితర పనుల కోసం స్థానిక సర్పంచి ప్రిస్టేజ్ కోసం రూ.14 లక్షలు అప్పు చేసి ఖర్చు చేశారు. ఆ నిధులు ఏళ్లుగా రాకపోవడంతో వడ్డీలు కట్టుకుంటున్నారు.

ఏ ముఖ్యమంత్రీ చేయలేదిలా..



ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి.. ఇలా ఏ సీఎం కూడా పంచాయతీ కార్యాలయాలకు కరెంటు బిల్లు తీసుకోలేదు. సీఎం జగన్ మాత్రం విద్యుత్తు బకాయిల పేరుతో మా పంచాయతీల నిధుల్ని తీసేసుకున్నారు. ఖజానాలో డబ్బుల్లేకపోవడంతో 14, 15వ ఆర్థిక సంఘం నిధుల్నీ మళ్లించేశారు. దీంతో పంచాయతీల్లో అభివృద్ధి లేకుండా పోయింది. మేము బాధ్యతలు తీసుకుని మూడేళ్లయినా పైసా నిధులు ఇవ్వలేదు.

- భగవతి, ఓటివారిపల్లె సర్పంచి, యాదమరి మండలం

ప్రజలకు న్యాయం చేయలేకపోతున్నా



నా మీద నమ్మకంతో నన్ను గెలిపించిన ప్రజలకు నేను న్యాయం చేయలేకపోతున్నాను. వాటర్ ప్లాంట్ నిర్మించాను, తాగునీటి బోర్లు, పైపు లైన్లు వేశాను. ఇప్పటికే సుమారు రూ.2 లక్షల బిల్లులు రావాలి. కనీసం వీధి లైట్లు వేయాలన్నా ఖాతాల్లో నిధులు లేవు. సొంత డబ్బుల్ని ఖర్చు చేస్తున్నాం.

- ఊహ, నంజరపల్లె సర్పంచి, పెనుమూరు మండలం



వడ్డీలు కట్టుకోలేక..

మాకు వచ్చిన ఆర్థిక సంఘం నిధుల్ని ప్రభుత్వం దొడ్డి దారిన మళ్లించేసింది. దీంతో చిన్నపాటి పనులూ చేయలేకపోతున్నాం. తాగునీటి బోర్ల మరమ్మతు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, వీధి లైట్ల వంటి చిన్నపాటి పనులకు అప్పులు చేశా. ఇప్పుడు వడ్డీలు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నా. నన్ను గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నా.

- ఉషశ్రీ, తుంబపాళ్యం సర్పంచి, బంగారుపాళ్యం మండలం

జగన్‌ను ఇంటికి పంపేందుకు పనిచేస్తున్నాం



రాష్ట్రంలోని పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన రూ.8660 కోట్ల ఆర్థిక సంఘం నిధుల్ని ప్రభుత్వం లాగేసుకుంది. 2023-24 సంవత్సరానికి రెండో విడతగా వచ్చిన రూ.988 కోట్లనూ పంచాయతీల ఖాతాల్లో వేయలేదు. ప్రభుత్వం ఇవ్వాల్సిన రిజిస్ట్రేషన్, మైనింగ్ ఫీజు, ఎంటర్‌టైన్‌మెంట్, ప్రొఫెషనల్ ట్యాక్సునూ జమ చేయలేదు. రాష్ట్రంలోని 12918 మంది సర్పంచులు వైఎస్ జగన్‌ను గద్దె దింపాలని పనిచేస్తున్నాం.

- కోకా ప్రకాష్‌నాయుడు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు

నగరిలో నామినేషన్ వేయాలంటే..!



నగరి అసెంబ్లీ అభ్యర్థులకు ఓ సెంటిమెంటు ఉంది. నామినేషన్ వేసే ముందు వీరంతా పట్టణంలోని కొత్తపేటవద్ద గల అగరవినాయకస్వామి దేవాలయంలో పూజలు చేస్తారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారు. ఇలా..

● సెంటిమెంట్

గతంలో మాజీమంత్రి చెంగారెడ్డి, దొరస్వామిరాజు, ప్రస్తుతం భానుప్రకాష్, రోజా ఆ సెంటిమెంట్ పాటిస్తున్నారు. అదే క్రమంలో గురువారం టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆలయంలో పూజలు చేసి.. వేదపండితుల ఆశీర్వాదం తీసుకుని.. నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి ర్యాలీగా వెళ్లి నామినేషను వేశారు.

- నగరి

అభ్యర్థులూ.. నోటరీ విషయంలో జాగ్రత్త

ఉమ్మడి జిల్లాలో నామినేషన్ వేసే అభ్యర్థులూ.. నోటరీ అంశంలో జాగ్రత్త. లేదంటే నామినేషన్లు తిరస్కరణకు గురయ్యే ప్రమాదముంది. సాధారణంగా నామినేషన్‌తో పాటు ధ్రువీకృత లైసెన్స్‌డ్ అడ్వకేట్‌తో నోటరీ చేయించాలి. వీరిని గుర్తించడంలో అభ్యర్థులకు స్పష్టమైన అవగాహన అవసరం. ఆదాయ, స్థిర, చరాస్తులు, కేసులు, విద్యార్హతలు తదితర అంశాలను నామినేషన్ ఫారంలో పూరించి 13 డాక్యుమెంట్లతో కలిపి నామినేషన్ పత్రంతో పాటు వివరాలను ధ్రువీకరిస్తూ అఫిడవిట్‌పై నోటరీ సమర్పించాలి. జిల్లాలో చాలామంది అడ్వకేట్ నోటరీలు లైసెన్స్ గడువు ముగిశాక రెన్యువల్ దరఖాస్తు పంపి నోటరీగా కొనసాగుతున్నారు. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటే రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ అనుమతి ఇస్తుంది. చాలామంది గతంలో నోటరీ లైసెన్స్ పొంది, తర్వాత రెన్యువల్ చేసుకోకుండా కొనసాగుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది రిజిస్ట్రేషన్ల కార్యాలయాల పరిధిలో ఐదేళ్ల కిందట వంద మందికి పైగా నోటరీలు ఉండగా, తాజాగా 35 మంది మాత్రమే ఉన్నారు. వారి వివరాలను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో మంగళవారం అందుబాటులో ఉంచారు. వీరి పేర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ ఎనిమిది మంది రిటర్నింగ్ అధికారులకు పంపారు. ఇన్‌వ్యాలిడ్ నోటరీలతో ధ్రువీకరిస్తే నామినేషన్లు చెల్లుబాటు కావని అభ్యర్థులు గుర్తించాలని అధికారులు సూచిస్తున్నారు.

● నోట్ దిస్ పాయింట్

- చిత్తూరు కలెక్టరేట్

ఫ్యామిలీ క్యాంపెయిన్

చిత్తూరు లోక్‌సభ టీడీపీ కూటమి అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు కుటుంబ సమేతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గుడిపాల మండలం పసుమందలో దగ్గుమళ్ల సతీమణి సుజాత, తనయుడు రాధే, కుమార్తె రాజీవి, కోడలు ఎస్తేర్ ప్రియాంక, మనవళ్లు రేయాన్స్, రిహాన్స్, మనవరాలు మిషికా మైరా, పార్టీ కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. తనను ఎంపీగా గెలిపిస్తే పసుమంద గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.


- చిత్తూరు సిటీ



● వర్తమానం/ కుప్పం

ఒకవైపు అభివృద్ధి జరగలేదు. మరోవైపు దాడులు.. పోలీసు కేసులు పెరిగాయి. అందుకే భారీ ఆధిక్యంతో వైసీపీని ఓడించాలన్న కసితో కుప్పం టీడీపీ శ్రేణులు పనిచేస్తున్నాయి. అధినేత నిర్దేశించిన 'లక్ష' లక్ష్యంతో జోష్‌గా ముందుకు సాగుతున్నాయి. అటు వైసీపీ.. గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల సహాయ నిరాకరణ, విభేదాల ఉక్కపోతతో సతమతమవుతోంది. కొందరు నేతల క్వారీ, ఇసుక, భూదందాలు, అక్రమాలు శాపాలుగా వెంటాడుతున్నాయి. గ్రామాల్లో రెండు పార్టీలకు లభిస్తున్న ఆదరణ పరంగా ఈ తేడా స్పష్టంగా కనిపిస్తోంది.

టీడీపీలో జోష్



- 'లక్ష' మెజారిటీ లక్ష్యంగా విస్తృత ప్రచారం
- విభేదాల ఉక్కపోతలో వైసీపీ
- కుప్పం రాజకీయ ముఖచిత్రం

టీడీపీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఇక్కడే ఉంటూ పార్టీ కార్యకలాపాలను వేగవంతం చేస్తున్నారు. యువతను సమీకరిస్తూ వారికే ప్రధాన బాధ్యతలు అప్పగిస్తూ ప్రచారాన్ని ఉధృతం చేశారు. మరోవైపు చంద్రబాబు క్లాస్‌మేట్, సుదీర్ఘకాలంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్న పీఎస్ మునిరత్నం గ్రామాల్లో పర్యటిస్తూ.. సీనియర్లందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రచారాన్ని నడిపిస్తున్నారు. ఇంతకాలం అనారోగ్యంతో ఉన్న చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్ కూడా జనాల్లోకి వస్తున్నారు. కాంగ్రెస్‌నుంచి పార్టీలో చేరిన డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు గ్రామస్థాయిలో తనకున్న పరిచయాలతో పార్టీ బలాన్ని పెంచడంలో తనవంతు కృషి చేస్తున్నారు. ఇక, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తన అనుభవంతో పార్టీకి పునర్వైభవం తేవడంలో తవనంతు పాత్ర పోషిస్తున్నారు. ఇక, చంద్రబాబుకు లక్ష మెజారిటీ లక్ష్యంగా విధించుకున్న పార్టీ శ్రేణులు, ఆ దిశగా చురుగ్గా కదులుతున్నాయి. వైసీపీ నవరత్నాల ప్రభావాన్ని సూపర్ సిక్స్ పథకాల ప్రచారంతో దీటుగా ఎదుర్కొంటున్నారు. ఇలా, నాయకులు, కార్యకర్తలు గతంలో చిన్నచిన్న విభేదాలేవైనా ఉంటే పక్కనపెట్టి మరీ ఎన్నికల రంగంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నాయకులు వెంట ఉన్నా లేకున్నా ఎవరికివారు స్వచ్ఛందంగా ప్రచారాలలో పాల్గొంటూ టీడీపీ జెండాను భుజాన వేసుకుని తిరుగుతున్నారు.



అనిమిగానిపల్లెలో ఇటీవల టీడీపీ నేతల ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న జనం

పెరుగుతున్న చేరికలు : రోజురోజుకు వైసీపీనుంచి పార్టీలో చేరికలు పెరిగిపోతున్నాయి. గ్రామ స్థాయిలో కుటుంబాలకు కుటుంబాలు టీడీపీలో చేరుతున్నాయి. ఇక, ప్రజల్లోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో వీసమంత అభివృద్ధి కనిపించకపోవడంతోపాటు బలహీనులపై జరిగిన దాడులు, దౌర్జన్యాలు, వైసీపీ నేతల ఇసుక, క్వారీ దందాలతో వారు పూర్తిగా విసిగిపోయారు. దీంతో గ్రామాలలో టీడీపీవైపు మొగ్గు స్పష్టంగా కనిపిస్తోంది.

నామమాత్రంగా కాంగ్రెస్

కాంగ్రెస్‌కు ఎప్పటినుంచో పెద్ద దిక్కుగా ఉన్న డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు, టీడీపీలో చేరిపోయాక అసలే అంతంతమాత్రంగా ఉన్న ఆ పార్టీ పరిస్థితి నియోజకవర్గంలో పూర్తిగా తీసికట్టుగా మారిపోయింది. చిన్నాచితకా నాయకులు కొందరు జిల్లా పదవులకు ఎగబాకినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది. శాంతిపురం మండలానికి చెందిన ఆవుల గోపి అనే వ్యక్తికి టిక్కెట్టు ఇవ్వడంపై పార్టీలో వ్యతిరేకత పెరిగి, కుప్పంలోని పార్టీ కార్యాలయంలో ఫర్నిచర్‌ను శ్రేణులు ధ్వంసం చేసే వరకు వెళ్లింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రధాన పార్టీలపై ప్రభావం చూపే అవకాశం లేదు.

వైసీపీ: విభేదాలు, అసంతృప్తులు

నామినేషన్ల ప్రక్రియ మొదలైనా వైసీపీలో విభేదాలు తగ్గలేదు. పార్టీ శ్రేణులను కలుపుకొని పోవడంలో భరత్ విఫలమయ్యారు. రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్‌కు, భరత్‌కు పొసగడంలేదన్నది బహిరంగ రహస్యం. ఎన్నికల ప్రచార పర్వంలో ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ విధిలేని పరిస్థితుల్లో సఖ్యతగా ఉంటున్నా వీరిద్దరి మధ్యనా సున్నితమైన విభేదాలు ఉన్నాయన్న ప్రచారం ఉండనే ఉంది. ఇక, తన సామాజిక వర్గానికే (వన్నెకుల క్షత్రియ) చెందిన హెచ్.ఎం.మురుగేశ్‌కు పార్టీ మండల కన్వీనర్.. ఆయన కుమార్తె అశ్విని ఎంపీపీ, కోడలు వనిత వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా పదవులు ఇప్పించారు. ఇలా, ఒకే కుటుంబానికి మూడు పదవులు ఇవ్వడంపై అదే సామాజిక వర్గ నేతల నుంచీ నిరసన వ్యక్తమవుతోంది. ఇక, భూ ఆక్రమణలు, దాడులు, దౌర్జన్యాలకు సంబంధించి మురుగేశ్‌మీద ఆరోపణలున్నా, ఈ కుటుంబాన్నే భరత్ వెనకేసుకొస్తున్నారు. మిగిలిన మూడు మండలాల్లోనూ తన సామాజికవర్గంలోని కొందరు నాయకులనే ప్రోత్సహిస్తూ, మిగిలినవారిని నిరాశపరుస్తున్నారన్న ప్రచారం ఉంది. పైగా ఎమ్మెల్సీగా కుప్పం నియోజకవర్గానికి ఈయన చేసిందేమీ లేదు. స్థానికేతరుడు కావడంతో ఇక్కడి వారితో సంబంధాలు చాలా తక్కువ. పైగా వైసీపీ మార్క్ అయిన భూదందాలు, క్వారీ, ఇసుక దందాలు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను తీసుకొచ్చింది.



ప్రభుత్వంపై సర్పంచుల్లో ఆగ్రహం

2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని 89 పంచాయతీలలో ఏకంగా 74 వైసీపీ మద్దతుదారులు గెలుచుకున్నారు. ఈ పంచాయతీల్లో ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని కూడా జరగకపోగా.. నిధులనూ జగన్ ప్రభుత్వం దారి మళ్లించడం.. వలంటీర్ల వ్యవస్థతో తమ అధికారాలను నిర్వీర్యం చేయడం వంటి కారణాలతో అధికార పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు ఆగ్రహంతో ఉన్నారు. వీరంతా పర్వంలో ఎక్కడో తప్ప కనిపించడంలేదు.

వైభవంగా సీతారాముల కల్యాణం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 18: స్థానిక సొసైటీకాలనీలోని రామాలయంలో గురువారం సీతారాముల కల్యాణోత్సవం ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా సీతారాములను ఉత్సవవిగ్రహాలను ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వాములోరి కల్యాణం తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యుల తోపాటు పురప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

కిశోర్‌కుమార్‌రెడ్డి నామినేషన్ దాఖలు

పీలేరు, ఏప్రిల్ 18: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన మొదటి రోజే ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్, పీలేరు ఎన్నికల అధికారి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ముందు తన అభ్యర్థిత్వానికి సంబం ధించిన నామినేషను పత్రాలు దాఖలు చేశారు. కుటుంబ సమేతంగా ఎన్నికల కార్యాలయానికి వెళ్లిన కిశోర్‌కుమార్ రెడ్డి రెండ్లు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అనంతరం ఆయన సతీమణి నల్లారి తనూజా రెడ్డి కూడా టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అన్ని రకాల పత్రాలను జత చేసిన అనంతరం ఎన్నికల అధికారికి ఆమె నామినేషన్ పత్రాలు అందజేశారు. అదే విధంగా కిశోర్‌కు మార్ రెడ్డి తనయుడు డాక్టర్ నల్లారి అమరనాథరెడ్డి కూడా టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు ఎన్నికల అధికారి ముందు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలు సందర్భంగా పరిమిత సంఖ్యలో మాత్రమే ఎన్నికల కార్యాలయంలోకి అనుమతించారు. కిశోర్‌కు మార్ రెడ్డి కుమార్తె డాక్టర్ వైష్ణవీ రెడ్డి, ఆయన సోదరుడు సంతోష్ కుమార్‌రెడ్డి, బావ ప్రదీప్‌కుమార్‌రెడ్డి కుటుంబీకులను మాత్రమే అనుమతించారు.

నల్లారి కిశోర్ నామినేషన్‌కు తరలిన నాయకులు

వాల్మీకిపురం, ఏప్రిల్ 18: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కూటమి ఉమ్మడి అభ్యర్థి అయిన నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి వాల్మీకిపురం మండల వ్యాప్తంగా నాయకులు, కార్యక ర్తలు తరలివెళ్లారు. గ్రామాల నుంచి వాహనాలు ఏర్పాటు చేసుకుని పీలేరుకు పయనమయ్యారు. వచ్చే ఎన్నికల్లో తామంతా నల్లారి కిశోర్ వెన్నంటే ఉండి ఆయన గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా వచ్చే ఎన్నికల్లో పీలేరులో టీడీపీ జెండా ఎగరడం తథ్యమన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు నల్లారి కిశోర్ నామినేషన్‌కు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న తనూజా రెడ్డి,అమరనాథరెడ్డి



కిశోర్‌కుమార్ రెడ్డిని ఆశీర్వదిస్తూ దువా చేస్తున్న ముస్లిం మత పెద్దలు

కిశోర్ గెలుపు కోసం ముస్లిం పెద్దల 'దువా'

కలికిరి, ఏప్రిల్ 18: పీలేరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా నగరిపల్లెలోని ఆయన ఇంటి వద్ద ముస్లిం మత పెద్దలు దువా నిర్వహించారు. ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుతూ ఈ దువా ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో హాజరైన ముస్లిం మత పెద్దలు కిశోర్‌కుమార్ రెడ్డి గెలుపుతో నియోజకవర్గం అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. దువా నిర్వహించిన ముస్లిం పెద్దలకు కిశోర్ కృతజ్ఞతలు తెలిపారు. గతంలో వలే ముస్లింల అభివృద్ధికి, సంక్షేమానికి తాను శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు హఫీజ్ సయ్యద్ జాఫర్, ముఫ్తీ అహ్మదుల్లా, కరీముల్లా, హఫీజ్ యానస్, అన్సర్ బాషా, మూర్తకా, అబ్దుల్ ఖదీర్, అల్లాబక్షు, నిజాముద్దీన్, గోల్డ్ అబ్దుల్ ఖదీర్, వైజాగ్ బాషా, జుబేర్, మసూద్, ఖాజాపీర్, హబీబ్, ఇస్మాయిల్, రఫీ హజరత్, మున్వర్, అహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

మదనపల్లెలో తొలి నామినేషన్ కూటమి అభ్యర్థిదే

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 18: సాధారణ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా మదనపల్లె నియోజకవర్గానికి తొలి రోజున టీడీ పీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా తొలి బోణీగా నామినేషన్ దాఖలు చేశారు. నలుగురు అనుచరులతో వెళ్లి నిరాడంబరంగా రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్‌కు 12.30గంటల సమయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాదెళ్ల శివన్న, ఖాజాహుస్సేన్, మాజీ జడ్పీటీసీ రంగప్ప పాల్గొన్నారు. నామినేషన్ స్వీకరణ సమయం 3గంటలకు ముగియడంతో కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే వచ్చిందని రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ తెలిపారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కాగానే సబ్ కలెక్టరేట్‌కు 100 మీటర్ల దూరం వరకు నిషిద్ధ ప్రాంతంగా పోలీసులు ప్రకటించి కేవలం నామినేషన్ వేసే అభ్యర్థులు, వారి వెంట వచ్చే నలుగురు వ్యక్తులకు మాత్రమే సబ్‌కలెక్టరేట్ లోనికి అనుమతించారు. పుంగనూరు-మదనపల్లె జాతీయ రహదారి కావడంతో బస్సులు, ఇతర వాహనాలను ఎన్‌వీఆర్ లేఅవుట్ మీదుగా ఎంపీడీవో కార్యాలయం చిత్తూరు బస్టాండు వైపునకు ట్రాఫిక్ మళ్లించారు.

తంబళ్లపల్లెలో: ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలిరోజైన గురు వారం తంబళ్లపల్లె వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పెద్దిరెడ్డి ద్వారకనా థరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. తంబళ్లపల్లె రిటర్నింగ్ అధికా రి రాఘవేంద్రకు నామినేషన్ పత్రాలను అందచేశారు. అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే అనుమతించారు.

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి



జయహో బీసీ సభలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు ఆర్వే వెంకటేశ్, రాజన్న

నిమ్మనపల్లి, ఏప్రిల్ 18: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం తవళం గ్రామంలో జయహో బీసీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నేతలు మాట్లాడుతూ బీసీలకు చట్ట సభలలో ప్రాముఖ్యత కల్పించిన ఘనత చంద్ర బాబునాయుడుదేనన్నారు. ప్రస్తుతం బీసీల కొర కు టీడీపీ 50ఏళ్లకే పింఛన్‌ను ప్రవేశపెట్టిందన్నారు. మే13న జరిగే ఎన్నికల్లో మదనపల్లె ఎమ్మెల్యేగా అభ్యర్థి షాజహాన్‌బాషాకు సైకిల్ గుర్తుకు, ఎంపీ అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డికి కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించి చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయా లని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేత ఆర్వే వెంకటేష్, మాజీ మండల అధ్యక్షుడు రాజన్న, నాగయ్య, రమణ, జయమ్మ, శ్రీనివాసులరెడ్డి, శ్రీపతి, మహమ్మద్‌రఫి, శంకర పాల్గొన్నారు.

చాయ్‌తాగి ఆలోచించండి..టీడీపీకి ఓటు వేయండి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 18: అన్నలు, తమ్ముళ్లు వేడివేడి చాయ్ తాగి ఆలోచించండి...టీడీపీకి ఓటు వేయండంటూ మదనపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా కోరారు. గురువారం స్థానిక మార్చురివీధిలో ప్రచారం చేస్తున్న షాజహాన్‌బాషా అక్కడ శీనా టీ దుకాణంలోకి వెళ్లి స్వయంగా తన చేతులతో టీ తయారు చేసి గాజు గ్లాసులోకి వేడి టీని పోస్తూ అక్కడికి వచ్చిన వారందరికి పంచిపెట్టారు. అనంతరం టైలర్స్ అసోసియేషన్ నాయకుల సమస్యలు తెలుసుకున్నారు. సీటీఎం గ్రామానికి వెళ్లి మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డితో కలసి టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. క్లస్టర్ ఇన్చార్జి చల్లా నరసింహులు, రామ్మూర్తి, వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.

నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

తంబళ్లపల్లె, ఏప్రిల్ 18: తంబళ్లపల్లె కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ వేయనున్న దాసరిపల్లె జయచంద్రారెడ్డి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజంపేట పార్లమెంటు తెలుగుయువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర పిలుపునిచ్చారు. ములకలచెరువు టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి తంబళ్లపల్లె రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి తెలుగుయువత, టీడీపీ, జనసేన, బీజేపి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నామినేషన్ కార్యక్రమానికి తరలిరండి

- కుటుంబ సభ్యుడిగా భావించి భాగస్వాములు కండి
- తంబళ్లపల్లె కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 18: తంబళ్లపల్లెలో శుక్రవారం జరిగే తన నామినేషన్ కార్యక్రమానికి తరలిరావాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో గురువారం తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యుడిగా భావించి నామినేషన్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయం నుంచి ఉదయం 10 గంటలకు ప్రదర్శనగా బయలుదేరి తంబళ్లపల్లెలో నామినేషన్ దాఖలు చేస్తానన్నారు. ఈ కార్యక్రమానికి రాజంపేట పార్లమెంటు కూటమి ఎంపీ అభ్యర్థి, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజులతో పాటు పలువురు నేతలు హాజరవుతారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు, శ్రేయోభిలాషులతో పాటు ప్రజలు భారీ సంఖ్యలో హాజరై ఆశీర్వదించాలని కోరారు. ఒక్క అవకాశం కల్పిస్తే మీలో ఒక్కడిగా ఉంటానన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించి రాష్ట్రంలోనే ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో రాజ్యమేలుతున్న అరాచక పాలనను సాగనంపుదామన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు.

నామినేషన్ల పర్వం.. ప్రజలకు కష్టాలు ఆరంభం



చిత్తూరుబస్టాండు సర్కిల్‌లో రహదారికి అడ్డంగా నిలిపిన పోలీసుల వాహనం

మదనపల్లె, ఏప్రిల్ 18: సాధారణ ఎన్నికల ఘట్టంలో కీలకమైన నామినేషన్ల ప్రక్రియ మొదలుతో పట్టణ వాసులకు ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. ఈనెల 25వ తేదీ వరకూ జరిగే ఈ క్రతువులో మొదటి రోజు గురువారం పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రం నుంచి వంద మీటర్ల వరకూ ప్రజలనే కాదు..వాహనాలను అనుమతించలేదు. ఇటు చిత్తూరు బస్టాండు సర్కిల్ నుంచి అటు పుంగనూరురోడ్డులోని మిషన్‌కాంపౌండ్ వరకూ రోడ్డును బంద్ చేశారు. ఈ మధ్యలోని ఈస్టుకొత్తపేట, బర్మావీధి, తర్వాతవీధులే కాదు..ఆ ప్రాంతంలోని ప్రజలను అటు, ఇటు వెళ్లకుండా కట్టడి చేశారు. దీంతో గాంధీ రోడ్డు గుండా వెళాల్సిన ప్రజలు, వాహనదారులు పైప్రాంతాల గుండా తిరుక్కోని వెళ్లాల్సివచ్చింది. ఇక్కడే కాదు..అగ్నిమాపక కేంద్రం సమీపంలోని కూడా రోడ్డును బంద్ చేశారు. దీంతో పాఠశాలలు, ఆసుపత్రులు, వ్యాపారకేంద్రాలకు వెళ్లాల్సిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొదటి రోజు కావడంతో చాలా మందికి తెలియడం లేదు. ఇలా వారంరోజులపాటు పట్టణ వాసులకు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందేనని పోలీసులు చెబుతున్నారు. అలాగే గాంధీరోడ్డు మీదుగా వెళ్లాల్సిన ప్రైవేటు, ఆర్టీసీ బస్సులను కూడా బైపాస్‌మీదుగా దారి మళ్లించారు. వాహనాలను అనుమతించక పోయినా కనీసం కాలినడక వెళ్లే వారిని, అందులోనూ ఆ ఏరియా వారిని అనుమతించాలని స్థానికులు కోరుతున్నారు. గురువారం మొదటిరోజు కావడంతో పెద్దగా ట్రాఫిక్ అనిపించలేదు. అయితే..ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్ర్య అభ్యర్థుల నామినేషన్లను శుక్రవారం నుంచి ముమ్మరం చేయనున్నారు. ఈ నేపథ్యంలో బలప్రదర్శనగా వచ్చే జనాలతో రద్దీ ఏర్పడి ట్రాఫిక్‌కు మరింత ఇబ్బందులు ఏర్పడే అవకాశముంది. ఇదిలావుండగా, ఎక్కడిక్కడ ప్రజలను, వాహనాలను అడ్డుకోవడంతో జనసంచారం లేక రోడ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. మరోవైపు ఎండలు మండటంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి.

తూనికలు, కొలతల్లో వ్యత్యాసం వస్తే కేసులు నమోదు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 18: తూనికలు, కొలతలలో వ్యత్యాసం వస్తే కేసులు నమోదు చేస్తామని లీగల్ మెట్రాలజి ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో తూనికలు, కొలతలకు సంబంధించి క్యాంపెయినింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది ఒక సారి తూనికలను కొలతలను తనిఖీ చేసి మరమ్మతుకు గురైన వాటికి మరమ్మతు చేసి సర్టిఫికెట్ ఇస్తామన్నారు. అదే విధంగా ఎలక్ట్రానిక్ మిషన్‌లకు అయితే ఏడాది ఒక సారి, సాధారణ తూకాలు అయితే రెండేళ్ల ఒక సారి సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. ఒక వేల సర్టిఫికెట్ తీసుకోకుండా అలాగే తూకాలు వేస్తూ వ్యత్యాసాలు వస్తే అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి దుకాణ దారుడు తప్పని సరిగా తూనికలు, కొలతకు సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఈశ్వర, ప్రభాకర్‌నాయుడు, మోహన్, భాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

పీలేరు, ఏప్రిల్ 18: వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొండయ్య పేర్కొన్నారు. గురువారం పీలేరు మండలంలో రేగళ్లు, తలపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా డెలివరీ గదులు, ఫార్మసీ, ల్యాబ్, వార్డులు తదితరం పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి రికార్డులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీలో నెలకు కనీసం 5కాన్పులు తప్పనిసరిగా చేయాలని, గర్భిణులకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తూ తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం దోహదపడాలన్నారు. వేసవి దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రమేష్‌రెడ్డి, చంద్రశేఖర్‌నాయక్, సీహెచ్‌వో జయలక్ష్మీ, సూపర్‌వైజర్లు కృష్ణయ్య, చిన్నప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగండి

కురబలకోట, ఏప్రిల్ 18: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 25, 26 తేదీల్లో జాతీయస్థాయిలో టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ-2కె24 క్రీడాపోటీలను ప్రారంభించనున్నారు. ఈ పోటీలకు వివిధ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 70టీమ్‌లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా క్రికెట్, వ్యాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, టెన్నీకాయిట్, చెస్, క్యారమ్స్ తదితర పోటీలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీనటుడు నిఖిల్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన...కేసు నమోదు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 18: ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించడంతో ఓ వైసీపీ నాయకుడిపై కేసు నమోదయ్యింది. గురువారం తంబళ్లపల్లె నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో పెద్దఎత్తున బాణసంచా పేల్చి ఎలక్షన్ కోడ్ అతిక్రమించినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని తంబళ్లపల్లె ఎంపీడీవో కృష్ణమూర్తి తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించినందుకు గానూ ఓ వైసీపీ నాయకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 18: ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అశోక్(40) అనే వ్యక్తి గురువారం మృతి చెందినట్లు టూటౌన్ సీఐ యువరాజ్ తెలిపారు. అతను ధరించిన దుస్తులను బట్టి పెయింటర్‌గా గుర్తించామని, ఇతని మృత దేహం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉందని ఇతని గురించి వివరాలు తెలిసినవారు, సెల్‌నెంబర్లకు 9440796741, 9491074519 సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇండియా కూటమి ప్రచారం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 18: ఇండియా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మల్లెలపవన్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి ప్రచారం ముమ్మరం చేశారు. గురువారం పట్టణంలోని రెండోవార్డులో ఇంటింటికి తిరిగి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దంతాల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కలకడ, ఏప్రిల్ 18: ప్రజలు దంతాల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని డాక్టర్ జవహర్‌బాబు తెలిపారు. గురువారం పాపిరెడ్డి గారిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దంతవైద్యులు సుభాషిణి పరీక్షలు చేశారు. అలాగే దంతాల సంరక్షణకు తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

రీజనల్ స్థాయిలో మదనపల్లె వన్ డిపో ప్రథమస్థానం



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న వన్ డిపో మేనేజరు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 18: రీజనల్ స్థాయిలో అన్ని విభాగాల్లో మదనపల్లె ఆర్టీసీ వన్‌డిపో ప్రథమ స్థానం సాధించిందని జిల్లా రవాణా అధికారి రాము పేర్కొన్నారు. గురువారం మదనపల్లె వన్ డిపో మేనేజరు వెంకట రమణారెడ్డిని దుశ్శాలువ కప్పి, ప్రశంసా పత్రంతో సన్మానించారు. రీజనల్‌లో ఇంధనం పొదుపు, కేఎంపీఎల్, ఈపీకే, పాలనాపరంగా, ప్రయాణికుల సౌకర్యాల కల్పనలో మొదటి స్థానంలో మదనపల్లె వన్ డిపో ఉందన్నారు. అలాగే ఈ నెల 25న బికొత్తకోట మార్గం లో లక్కీ డిప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ మార్గంలో ప్రయాణం చేసిన తరువాత టికెటు వెనుక భాగంలో పేరు, ఊరుపేరు, సెల్‌నెం బర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన గిఫ్ట్‌బాక్సులో వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

కలకడ, ఏప్రిల్ 18: ఏపీ గురుకుల పాఠశాలు, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రవేశానికి ఈ నెల 25న జరిగే పరీక్షల హాల్ టికెట్లను అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని కలకడ ప్రిన్సిపాల్ ఎన్.సుమిత్ర పేర్కొన్నారు. 5, 6, 7 , 8 తరగతులకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు కళాశాలలకు మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. హాల్ టిక్కెట్‌లు వెబ్ సైట్‌లో అభ్యర్థులు తమ కాండిడేట్ ఐడి, పుట్టిన తేదీలను హెచ్‌టీటీ పీఎస్://ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ లో నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. హాల్ టికెట్‌లు పోస్టు ద్వారా పంపమన్నారు.

పాలీసెట్ హాల్ టికెట్ల విడుదల

కలికిరి, ఏప్రిల్ 18: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 27న నిర్వహించను న్న పాలిసెట్-2024 ప్రవేశ పరీక్షల కోసం హాల్ టికెట్లను విడుదల చేశారు. రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ వైబ్ సైట్‌లో ఈ మేరకు హాల్ టికెట్లను అందు బా టులో వుంచారు. అభ్యర్థులు తమ పదో తరగతి పరీక్షల హాల్ టికెట్ లేక మొబైల్ నంబరు, అదే విధంగా ఉత్తీర్ణులైన లేదా పూర్తి చేసిన సంవత్సరంను వెబ్‌సైట్‌లో నమోదు చేసి హాల్ టికెట్ పొందవచ్చన్నారు.

విధ్వంసంపై పోరాటమిది.. గెలిచితీరాలి





పీలేరు నాలుగు రోడ్ల కూడలిలో మాట్లాడుతున్న నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

ర్యాలీకి పోటెత్తిన జనం

- చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలి
- సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించండి
- కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించండి
- పీలేరు సభలో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి
- అట్టహాసంగా నామినేషన్ ర్యాలీ
- భారీగా హాజరైన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

పీలేరు, ఏప్రిల్ 18: 'అవినీతి, విధ్వంస, దౌర్జన్యకర వైసీపీ పాలనపై ఐదేళ్ల సుదీర్ఘ పోరాటంలో అఖరి ఘట్టానికి చేరుకున్నాం. రానున్న 25 రోజులు అవిశ్రాంతంగా పనిచేసి స్థానికంగా కూటమి అభ్యర్థులను గెలిపించుకుని తద్వారా చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా గురువారం ఆయన తన సోదరు డు, మాజీ సీఎం, కూటమి రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డితో కలిసి పీలేరులో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి ఆయన ప్రజావ్యతిరేక విధానాలు, విధ్వంసకర పాలనపై అలుపెరుగని పోరాటం చేశామన్నారు. రానున్న 25 రోజులు ఆఖరి పోరాటమని పోలింగ్ జరిగే మే 13వ తేదీ సాయంత్రం వరకు కూటమి శ్రేణులు విశ్రమించకూ డదని దిశానిర్దేశం చేశారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని వైసీపీ నాయకులు అక్రమాలకు పాల్పడనుందని ప్రజలను అన్నీ గమనిస్తున్నారని మనస్సాక్షి మేరకు టీడీపీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సైనిక్ స్కూల్, నాలుగు పాలిటెక్నిక్ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాల, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహిళా రెసిడెన్షియ ల్ డిగ్రీ కళాశాల, ఐటీబీపీ, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్లు తెచ్చానన్నారు. గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ నాయకులు అభివృద్ధిని గాలికి వదిలేసి భూఆక్రమణలపై పడ్డారన్నారు. విధ్వంసకర వైసీపీ పాలనకు చర మగీతం పాడి, అభివృద్ధి కాముక కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అట్టహాసంగా ర్యాలీ...పోటెత్తిన జనం

నామినేషన్ సందర్భంగా నల్లారి సోదరుల ఆధ్వర్యంలో కూటమి నేతలు నిర్వహించిన పీలేరు ర్యాలీకి పీలేరు నియోజకవర్గ నలుమూలల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలి వచ్చారు. ర్యాలీకి పీలేరులోని తిరుపతి మార్గంలో ఇసుకేస్తే రాలనంత జనం పోగయ్యారు.

నల్లారి సోదరుల ప్రసంగాలకు విశేష స్పందన

పీలేరులో జరిగిన సభలో నల్లారి సోదరుల ప్రసంగానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సభకు హాజరైన వారు కరతాళ ధ్వనులు, కేరింతలతో సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిమ్మాపురం రఘురామిరెడ్డి, రవిప్రకాశ్, మద్దిపట్ల సూర్యప్రకాశ్, అమరనాథరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాజా, పురం రామ్మూర్తి, సురేంద్ర, మల్లిఖార్జునరెడ్డి, గీతాంజలి, జగదీశ్, నిజాముద్దీన్, మల్లెల రెడ్డిబాషా, పురం రెడ్డమ్మ, సాధన, లక్ష్మీకాంతమ్మ, రమాదేవి, రియాజ్, చిన్నా, మహమ్మద్‌పీర్, సలీం, బీజేపీ నాయకులు చంద్రశేఖర రెడ్డి, వెంకటరమణ, పొత్తూరి శ్రీకాంత్, మహదేవనాయుడు, జనసేన నాయకులు బెజవాడ దినేశ్, కలప రవి, మోహనకృష్ణ, గజేంద్ర, పవన్, తదితరులు పాల్గొన్నారు.